## సామాన్యులకు కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి



వివరాలు 2లో..


# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 18 సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## పత్తి ధర తగ్గింపుపై రైతుల ఆందోళన..



వివరాలు 2లో..

# న్యాయస్థానాలపై నమ్మకం ఉంది

- భవిష్యత్తులో ఎప్పుడు పిలిచినా మళ్లీ వస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,సెప్టెంబర్-18: ఫార్ములా ఈ రేసును హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్రానికి, హైదరాబాద్ మహానగరానికి పేరు తీసుకురావాలని ప్రయత్నించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ రేసులో ఏదో జరిగిపోయిందంటూ రేసును రద్దు చేసి తనపై కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసును న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.ఫార్ములా ఈ రేసు కేసులో భాగంగా శుక్రవారం నాంపల్లి కోర్టుకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇవాళ నేను రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్రానికి, హైదరాబాద్ మహానగరానికి పేరు తెచ్చే ఒక మంచి కార్యక్రమం ఫార్ములా ఈ రేస్‌ని హైదరాబాద్‌కి మిగతా 3లో..

# ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు ఆధారంగానే ప్రాజెక్టులకు మరమ్మతులు

- అక్టోబర్‌లో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారానికి రిపేర్లు
- రీ డిజైన్ పేరుతో రాష్ట్రానికి నష్టం చేశారు
- ఏపీకి నీళ్లు వదులుతున్నామనేది అవాస్తవం
- కృష్ణా, గోదావరిలో ఎక్కువనీళ్లు వాడుకుంది మనమే
- లోటు వర్షపాతంతో సాగుపై ప్రభావం
- రైతాంగానికి అండగా ఉంటాం : అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్-18: రాష్ట్రంలో ఎల్‌నినో కష్టాలకు కాళేశ్వరం ప్రాజెక్టు తప్పిదాలు కూడా తోడయ్యాయని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం రీ డిజైన్ పేరుతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని వివరించారు. కేసీఆర్ స్వీయ ఇంజినీరింగ్ నైపుణ్యం ఫలితంగా కుంగింది ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదనీ, సుందిళ్ల, అన్నారం పునాదుల పటిష్టతపైనా సందేహాలు ఉన్నాయన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఈ ఏడాది జూన్‌లో ఇచ్చిన నివేదికలో ఆ బరాజ్‌ల వద్ద గేట్లు తెరిచే ఉంచాలనీ, నీటిని నిల్వ చేయొద్దని స్పష్టంగా చెప్పిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతు పనుల్ని అక్టోబర్‌లో చేపడతామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు (కేసీఆర్) కాళేశ్వరం రీడిజైన్ చేయకుండా, తుమ్మిడి హట్టి వద్ద నిర్మాణం చేపట్టి ఉంటే, ఎల్‌నినో కష్టాల నుంచి రాష్ట్రం బయటపడి ఉండేదని స్పష్టంచేశారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయనీ, ప్రాణహితలో మాత్రమే నీళ్లు ఉన్నాయని వివరించారు. కేసీఆర్ రీ డిజైన్ వల్ల తుమ్మిడిహట్టి నుంచి ఆ నీటిని ఎత్తిపోసుకొనే అవకాశాలను కోల్పోయామన్నారు. 'ఎల్‌నినో ప్రభావాలు-పరిష్కార చర్యలు' అంశంపై శుక్రవారం అసెంబ్లీలో లఘుచర్చ జరిగింది. చర్చను మంత్రి ప్రారంభించారు.అనంతరం బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులు కూడా ఈ అంశంపై మాట్లాడారు. అనంతరం మంత్రి సభ్యులు లేవనెత్తిన అంశాలకు వివరణ ఇచ్చారు. ఎల్‌నినో మిగతా 3లో..

# కేంద్రం ఆదుకోవాలి



- రుణపరిమితి 3.5 శాతానికి పెంచాలి..కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి
- అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..శాసనసభ నిరవధిక వాయిదా

హైదరాబాద్,సెప్టెంబర్-18: రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల ప్రభావం నుంచి గట్టెక్కేందుకు వీలుగా తక్షణమే తగినంత సహాయం అందించాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. శుక్రవారం ఎల్ నినో పరిస్థితులపై స్వల్పకాలిక చర్చ అనంతరం తీర్మానాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. "ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా రాష్ట్రానికి మిగతా 3లో..

## కుల గణనలో బీసీలకు అన్యాయం జరగొద్దు..



- కేంద్రానికి కల్వకుంట్ల కవిత వార్నింగ్!

3లో..

# భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక..

- పాక్ ప్రభుత్వ తీరుపై ఇండియా ఆగ్రహం



న్యూఢిల్లీ, సెప్టెంబర్-18: భారత యుద్ధ నౌకను ఇటీవల పాక్ నౌక ఢీకొన్న సంగతి తెలిసిందే. ఈ నెల 15, సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ విషయంలో పాక్ ప్రభుత్వం స్పందించిన తీరుపై ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ అంశంపై శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పాక్ స్పందించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అంశంలో పాకిస్తాన్ స్పందన సరిగ్గా లేదని, ఎప్పట్లాగే ధాటవేత ధోరణిని పాక్ అనుసరించిందన్నారు. అలాగే, పాకిస్తాన్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ కోల్‌కతా నౌక సాధారణంగా గస్తీ నిర్వహిస్తుండగా.. పాకిస్తాన్‌కు చెందిన నేవీ నౌక హునైన్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పాక్ నౌక వ్యవహరించిన తీరు అనైతికంగా ఉంది. ఇది ఇండియా-పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆర్టికల్ 10ని మిగతా 3లో..

# అడ్డగోలు ఆరోపణలు

- పేదల ఖాతాల్లో లక్ష కోట్లు వేస్తావా?..
- మాకున్న ప్రతి ఇంచు భూమి రాసిస్తాం..!
- వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ప్రచారం
- కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బంపర్ ఆఫర్



హైదరాబాద్,సెప్టెంబర్-18: పేదల ఖాతాల్లో లక్ష కోట్లు వేస్తామంటే తమ పేరిట ఉన్న ఇంచు భూమిని కూడా రాసిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బంపర్ ఆఫర్ ఇచ్చారు. తమ కుటుంబానికి లక్ష కోట్ల భూములు ఉన్నాయంటూ సీఎం చేసిన ఆరోపణలపై సవాల్ విసిరిన కేటీఆర్ పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఆయన అడ్డగోలు ఆరోపనణలు చేస్తున్నారని ఎక్స్ పోస్ట్‌లో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ పేరుతో ఉన్న ఆస్తులన్నింటినీ మిగతా 3లో..

## సుప్రీం చెప్పినా డోంట్ కేర్..!



- నవోదయ స్కూళ్లపై తేల్చేసిన విజయ్ సర్కార్..! వివరాలు 4లో..

# 22 ఏ నుంచి రేవంత్ తప్పించుకోలేడు..

- ఆయనకు శిక్ష పడాల్సిందే : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్-18: : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు చేసినా 22 ఏ( 22ా) పై చేసిన తప్పుల నుంచి తప్పించుకోలేడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలో ఆయన మీడి యాతో మాట్లాడారు. ఇతరుల పై ఆరోపణలు చేసి తప్పించుకోవాలని తెలివితక్కువ వేషాలు వేస్తున్నాడని విమర్శిం చారు. ముఖ్యమంత్రికి ప్రజల నుంచి శిక్ష తప్పదని హెచ్చరించారు. మిగతా 3లో..

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా ..

- అక్టోబర్ 9న పోలింగ్..!
- రంగంలోకి గుర్తింపు సంఘాలు



హనుమకొండ, సెప్టెంబర్ 18: ఆర్టీసీలో ఎన్నికల నగారా మోగింది. సుమారు ఎనిమిదేళ్లుగా అందరూ ఎదురుచూ స్తున్న గుర్తింపు సంఘం(యూనియన్) ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర కార్మిక శాఖ అధికారికంగా విడుదల చేసింది. అక్టోబర్ 9న పోలింగ్, 17న ఫలితాలు వెలువడ ను న్నాయి. దీంతో వరంగల్ రీజియన్ పరిధి లోని అన్ని డిపోల్లో ఎన్నికల మిగతా 3లో..

# 22 ఏ భూములపై రేవంత్ కీలక నిర్ణయం..




### సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

హైదరాబాద్,సెప్టెంబర్-18: తెలంగాణలో ఇప్పుడు సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం హాట్ హాట్ గా సాగుతోంది. దీనిపై ప్రతిపక్షాలు రేవంత్ సర్కార్ ను టార్గెట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో గత కొంతకాలంగా భూ యజమానులను కలవరపెడుతున్న 'సెక్షన్ 22ఏ' నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రాష్ట్రప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక హై-లెవల్ కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. భారత రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం.. ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తులు, మరియు రక్షణ అవసరాలకు సంబంధించిన కొన్ని కీలక ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడానికి అధికారం ఉంటుంది. దీని ఆధారంగా రిజిస్ట్రేషన్ శాఖ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ లిస్ట్ ను నిర్వహిస్తుంది. అయితే సాధారణంగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ శాఖకు చెందిన, లేదా వక్ఫ్ ఆస్తులు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులు ఈ జాబితాలో ఉంటాయి. ఈ జాబితాలో ఉన్న సర్వే నంబర్లకు సంబంధించిన భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు సాధ్యం కావు. రికార్డుల డిజిటలైజేషన్ మరియు పాత డేటా నమోదులో జరిగిన కొన్ని సాంకేతిక లోపాల వల్ల చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులు కూడా పొరపాటున ఈ నిషేధిత జాబితాలోకి చేరిపోయాయి. ఒకే సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉండి, మిగతాది ప్రైవేట్ వ్యక్తులదైనా సరే.. మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో ట్యాగ్ చేయడంతో అసలు యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిగతా 4లో..

## ట్రంప్ వార్నింగ్..



- అస్సలు తగ్గేదే లేదన్న భారత్!

వివరాలు 4లో..

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

వివరాలు 2లో..

# దానంపై హైకోర్టు వేటు..



హైదరాబాద్,సెప్టెంబర్-18: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుపై రాష్ట్ర హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయించినట్టు నిర్ధారించింది. ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, అదే పార్టీలో కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ద్వారా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23న కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని 2(1)(ఏ)తోపాటు ఆర్టికల్ 191(2) ప్రకారం ఎమ్మెల్యే పదవికి అనర్హుడని ప్రకటించింది.ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్టు స్పష్టంచేసింది. అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ ఈ ఏడాది మార్చి 11న ఇచ్చిన మిగతా 3లో..

# నా జీవితం తెరిచిన పుస్తకం..



- ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు స్పష్టంగా చెప్పిన
- మాజీ మంత్రి హరీశ్ రావు

2లో..

## గ్రేట్ మహానగరి జిల్లాలు

● హైదరాబాద్ ● మేడ్చల్- రంగారెడ్డి

# రేవంత్‌కు వరుస ఎదురుదెబ్బలు




**హైదరాబాద్,సెప్టెంబర్-18:** రేవంత్‌రెడ్డి సర్కార్‌కు శుక్రవారం ఒకే రోజు ఐదు ఎదురుదెబ్బలు తగిలాయి. కేటీఆర్ పీఆర్వో మహేశ్‌తోపాటు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలన్న రేవంత్ ప్లాన్ విఫలమైంది. వారికి రిమాండ్ అవసరం లేదని న్యాయస్థానాలు చెప్పడంతో ప్రభుత్వం నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టు అయింది. మరో వైపు, పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో పార్టీ ఫిరాయించిన మరో ఎనిమిది మందిలో భయాందోళన మొదలైంది. ఎర్రవెల్లి వైపు రాజకీయ దండయాత్ర తలపెట్టిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలకు భారీ పోలీసు బందోబస్తు మాత్రమే ఎదురైంది. ఆశించిన ఏదో ఫలితం రాకుండానే పథకం ఎదురుతన్నింది. ఖమ్మంలోని శ్రీనివాస నగర్‌లో పేదల ఇండ్లను కూల్చవద్దని బీఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి న్యాయస్థానంలో మద్దతు లభించింది. శ్రీనివాసనగర్‌లోని ఇండ్లను కూల్చవద్దని హైకోర్టు ఆదేశించడం కాంగ్రెస్ సర్కార్‌కు చెంపపెట్టుగా మారింది. ఈ పరిణామాలను రేవంత్ ప్రభుత్వానికి ఒకేరోజు ఐదు వరుస ఎదురు దెబ్బలుగా బీఆర్ఎస్ నేతలు అభివర్ణించారు.

### క్రిశాంక్ ఇంటిపై పోలీసుల హైడ్రామా

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ఇంటి వద్ద శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు భారీగా మోహరించడం మరో వివాదానికి దారితీసింది. సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కేసుకు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు మొదట నోటీసు ఇవ్వడానికి వచ్చామని చెప్పి, అనంతరం ఇం టి తలుపులు, గేటు బద్దలు కొట్టి మరీ క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన క్రిశాంక్ భార్య, బిడ్డ ఏడుస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. క్రిశాంక్ కుటుంబంపై ప్రభుత్వ, పోలీసుల దమనకాండ తీరుపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.న్యాయస్థానంలో క్రిశాంక్‌ను హాజరుపరిచిన పోలీసులు 14 రోజులపాటు రిమాండ్ విధించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఏడేండ్లకు పైబడిన శిక్షకాదు కాబట్టి రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. క్రిశాంక్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై రెచ్చగొట్టే, తప్పుడు సమాచారం ప్రచారం చేశారన్నది ఫిర్యాదుదారుల ఆరోపణ. అయితే, తాను పోలీసులపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వెనుక ఉన్న అంశాలు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనలకు సంబంధించినవేనని క్రిశాంక్ తెలిపారు. ఆ వ్యవహారంలో సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని హైకోర్టు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు.

## సెన్సార్ పేరుతో గొంతు నొక్కుతున్నారు..

### సీబీఎఫ్‌సీ కొత్త మార్గదర్శకాలపై భగ్గుమంటున్న సినీ లోకం

**హైదరాబాద్,సెప్టెంబర్-18:** భారతదేశంలో సినిమాల సర్టిఫికేషన్ కోసం కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా సవరించిన నిబంధనలను విడుదల చేసింది. 1991 నాటి పాత మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ తాజా నిబంధనలపై సినీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవు తోంది. ఇది సర్టిఫికేషన్ కాదని, పూర్తిగా సెన్సార్ చేయడమేనని నెటిజన్లు, సినీ ప్రియులు మండిపడుతున్నారు.ఇక కొత్త నిబంధనల ప్రకారం.. సినిమాలలో హింస, డ్రగ్స్, ధూమపానం వంటి వాటిని ప్రోత్సహించేలా చూపకూడదు. లైంగిక దాడి దృశ్యాలను గ్రాఫిక్ రూపంలో ప్రదర్శించరాదు. మహిళలను కించపరిచేలా లేదా తక్కువ చేసి చూపేలా కంటెంట్ ఉండకూడదు. చిన్నారులు హింసకు గురయ్యే లేక హింసను ఎదుర్కొనే సన్నివేశాలపై ఆంక్షలు విధించారు. అలాగే, కోర్టుల గౌరవానికి భంగం కలిగించేలా, విదేశీ సంబంధాలను దెబ్బతీసేలా లేదా దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నించేలా చిత్రాలు ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ మార్గదర్శకాలను సినిమాను మొత్తంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించినప్పటికీ, ఇవి సృష్టికర్తల స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.ఈ నిబంధనల వల్ల భారతదేశంలో సామాజిక-రాజకీయ చిత్రాలు రావడం కష్టమని, సమాజంలో జరిగే తప్పులను ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకే వీటిని తెచ్చారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సెన్సార్ నిబంధనలు ఇలాగే కఠినంగా ఉంటే థియేటర్లకు ప్రేక్షకులు రావడం కష్టమని, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఇది పెద్ద ఎదురుదెబ్బని సినీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు :

### మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్-18:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు వేయడం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ స్వాగతిస్తుందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి , కాంగ్రెస్ పార్టీలో చేరి, అదే పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు కీలకమైన పరిణామమని పేర్కొన్నారు. దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టిందని వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇతర ఎమ్మెల్యేలకు కూడా ఈ తీర్పు ఒక స్పష్టమైన గుణపాఠమని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలి. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం మానుకోవాలని సూచించారు.

## వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి మరో కీలక అడుగు!




**హైదరాబాద్,సెప్టెంబర్-18:** చారిత్రక ఓరుగల్లు నగర ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్టు పనులలో వేగం పెరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కారణంగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి, డీపీఆర్ సిద్ధం చేయగా, నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. ఎయిర్‌పోర్టు పునరుద్ధరణలో భాగంగా రూ.213.59 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రధాన నిర్మాణ పనుల నిమిత్తం తాజాగా అధికారిక టెండర్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా వరంగల్ గడ్డపై మళ్లీ విమాన సర్వీసులు నడిపించేందుకు మార్గం సుగమమైంది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో పలు కీలక భవనాలను నిర్మించనున్నారు. ఇందులో ప్రధానంగా ప్రయాణికుల రాకపోకల కోసం విశాలమైన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్, విమానాల రాకపోకలను పర్యవేక్షించేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ నిర్మాణం జరగనుంది. అలాగే విద్యుత్ సరఫరా నిమిత్తం ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, అత్యవసర సేవల కోసం ఫైర్‌స్టేషన్, మరియు మెయింటెనెన్స్ పనుల కొరకు ఈఅండ్ఎం వర్క్‌షాప్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ కచ్చితంగా 18 నెలల కాలపరిమితిలోగా పూర్తి చేయాల్సి ఉంటుందని నిబంధనల్లో స్పష్టం చేశారు.ఈ టెండర్ ప్రక్రియకు సంబంధించి కీలక తేదీలను ఏఏఐ ఖరారు చేసింది. ఈ నెల 28వ తేదీన కాంట్రాక్టర్లు మరియు బిడ్డర్ల కోసం ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఆసక్తి గల సంస్థలు నవంబరు 3వ తేదీ వరకు తమ బిడ్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 9వ తేదీన టెక్నికల్ బిడ్లను, నవంబరు 30వ తేదీన ఫైనాన్షియల్ బిడ్లను అధికారులు పరిశీలించి తెరవనున్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమై పూర్తయితే, వరంగల్ ప్రాంతం పారిశ్రామిక, పర్యాటక మరియు రవాణారంగాల్లోఅపూర్వమైనఅభివృద్ధిని సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం..

● పక్కకు ఒరిగిన నాలుగు అంతస్థుల భవనం



**హైదరాబాద్,సెప్టెంబర్-18:** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మరో భవనం ప్రమాదకరంగా ఒరిగిపోవడం కలకలం రేపింది. గోపన్నపల్లి ఎన్టీఆర్‌నగర్‌లోని తాజ్ నగర్ లో సుమారు 45 గజాల స్థలంలో నిర్మించిన జీ ప్లస్ 4 అంతస్తుల భవనం ఒకవైపు ఒరిగినట్లు గుర్తించారు. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న సర్కిల్ అధికారులు అక్కడికి చేరుకుని ఒరిగిన భవనంతో పాటు చుట్టుపక్కల ఇండ్లను ఖాళీ చేయించారు.భవనంలో ఒక్కో అంతస్తులో రెండు గదుల చొప్పున మొత్తం తొమ్మిది గదులను నిర్మించారు. ఒక్కో గదిలో ముగ్గురి నుంచి ఐదుగురు వరకు నివసిస్తున్నట్లు సమాచారం. భవనం ఒరిగిన సమయంలో ప్రమాదం సంభవించి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అంజయ్యనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న భవనం కూలి ప్రాణనష్టం జరిగిన ఘటన మరువకముందే ఇదే సర్కిల్ పరిధిలో మరో భవనం ప్రమాదకర స్థితికి చేరడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. చిన్న స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు, నిర్మాణ నిబంధనల అమలు, అనుమతుల పరిశీలనపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే అక్రమ, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

## పత్తి ధర తగ్గింపుపై రైతుల ఆందోళన..

● రోజుకో ధరతో దోపిడీ చేస్తున్నారంటూ ఆగ్రహం

● ప్రభుత్వమే పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం

● రోడ్డుపై రాకపోకలకు అంతరాయం



**ఊట్కూర్, సెప్టెంబరు 18 :** పత్తి ధర తగ్గింపుపై రైతులు భగ్గుమన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని విజయ కాటన్ ఇండస్ట్రీ ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పత్తి వాహనాలతో తెల్లవారేసరికి ఇండస్ట్రీ వద్దకు చేరుకున్నారు. గురువారం క్వింటాలుకు గరిష్ఠంగా రూ.9,500 ధర పలకగా.. శుక్రవారం రూ.200 తగ్గించి రూ.9,400కు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. కొందరికి రూ.9,350 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకో ధర నిర్ణయిస్తూ తమను నష్టాల్లోకి నెడుతున్నారని మండిపడ్డారు. దిగుబడి దారుణం.. ధరా దిక్కులేదువర్షాభావంతో ఈ ఏడాది పత్తి దిగుబడి భారీగా పడిపోయిందని రైతులు వాపోయారు. చెట్టుకు రెండు, మూడు కాయలు మాత్రమే కాసిన పరిస్థితి ఉందన్నారు. ఎకరాకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పత్తికి గిట్టుబాటు ధర కల్పించకుండా రోజుకో ధర నిర్ణయించడం రైతులను మరింత అప్పుల్లోకి నెడుతోందని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు.వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. పత్తి ధరల విషయంలోనూ పట్టించుకోవడం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. పంట దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోతే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. రైతుల ఆర్థిక ఇబ్బందులు తీవ్రరూపం దాల్చితే ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు ఆందోళనకు దిగడంతో నారాయణపేట వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఉట్కూర్ ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం మిల్లు యజమానులతో చర్చించారు. మార్కెట్‌లోని ఆన్‌లైన్ ధరలను మిల్లు యజమానులు రైతులకు వివరించారు. ధరలపై చర్చించిన అనంతరం పోలీసులు, మిల్లు యజమానులు రైతులను సముదాయించారు. దాదాపు గంటపాటు కొనసాగిన ఆందోళన అనంతరం రైతులు ధర్నాను విరమించారు. పత్తికి న్యాయమైన ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

## నా జీవితం తెరిచిన పుస్తకం..

● ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు స్పష్టంగా చెప్పిన

● మాజీ మంత్రి హరీశ్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్-18:** నా జీవితం తెరిచిన పుస్తకం అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బైండ్ల సంఘం సమావేశానికి ము ఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. కాంగ్రెస్ వాళ్లు సిద్ది్‌ఎటకు వస్తున్నరట. నా భూములు చూసి పోతరట. వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బం డ్లు, రోప్ పార్టీలు ఎందుకు? డ్రోన్లు పెట్టి ఫొటోలు తీయడం ఎందుకు? నేను ఇక్కడే ఉన్న నాకు చెబితే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. మంచిగ కడుపు నిండ అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానని పేర్కొన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండి. అబద్ధాలు చెప్పకండని హితవు పలికారు. అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చినం. రామంచల 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెప్పుతున్నారు.నేను దాచింది ఏముంది. నువ్వు కొత్తగా బయట పెట్టేది ఏముంది. మీ లాగా నేను కబ్జాలు పెట్టలేదు, ప్రజల సొమ్ము దోచుకోలేదని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజలు నా పని చూసి ఏడు సార్లు గెలిపించారు. నన్ను దీవించారు. మీరు అంత భయపడాల్సిన అవసరం లేదు. మా సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయతకు, ఆతిథ్యానికి చిరునామా..సిద్దిపేటకు ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెడతాం ప్రేమగా మాట్లాడుడుతామన్నారు. అంత మంది పోలీసులు పెట్టుకొని భయపడుకుంటూ రావాల్సిన అవసరం మీకు లేదని తెలిపారు.

## ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్



**ములుగు,సెప్టెంబర్-18:** : ములుగు జిల్లా గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్‌కుమార్ రూ.14 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. భూమి పౌతి మార్పిడి ప్రక్రియ కోసం లంచం డిమాండ్ చేసిన ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తహసీ ల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. లంచం తీసుకున్న ఘటనకు సంబంధించిన ఆధారా లను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. భూమి పౌతి మార్పిడి కోసం కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ భేటీ!

### ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు స్పెషల్ టీం

### ఎల్‌నినో దెబ్బ.. ప్రత్యామ్నాయ ప్రణా ళికలు!

**హైదరాబాద్,సెప్టెంబర్-18:** తెలంగాణలో పర్యటిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ భేటీలో.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, పేదల గృహ నిర్మాణాలపై చర్చ సాగింది. కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్' (PMAY-G) కింద మొదటి విడతగా తెలంగాణకు రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి కేంద్ర మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన 11.56 లక్షల మంది నిరుపేద కుటు ంబాలకు ఇళ్లు నిర్మించాల్సి ఉందని, గతంలోనే ఇచ్చిన వినతిపత్రం ఆధారంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా త్వరగా మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

### ఎల్‌నినో దెబ్బ.. ప్రత్యామ్నాయ ప్రణా ళికలు!

రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గడం, ఫలి తంగా బోర్లకు డిమాండ్ పెరిగి వ్యవసాయ విద్యుత్ విని యోగం గణనీయంగా పెరిగిన తీరును కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. తాగు నీరు, సాగుకు విద్యుత్ కొరత రాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలను వివరిస్తూ, కేంద్రం నుంచి తగిన సహాయ సహ కారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్రంలో సన్న బియ్యం సాగు చేసే రైతులకు రూ.500 బోనస్ అం దిస్తున్నామని, పండించిన బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా పేదలకు అందిస్తున్నామని వివరించారు. అంత ర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన 250 ఎకరాల కూరగాయలు, పండ్ల మార్కెట్ గురించి ప్రస్తావిస్తూ.. పంటల మార్పిడికి రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రం మద్దతు నిలవాలని కోరారు. దక్షిణాది పరిస్థితులకు తగ్గట్టుగా ప్రత్యేక వ్యవ సాయ



విధానం! అనంతరం విలేకరులతో మాట్లాడిన కేం ద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. ఢిల్లీలో కూర్చుని దేశం మొత్తానికి ఒకే వ్యవసాయ విధానాన్ని రూపొం దించలేమని, ప్రాంతీయ వాతావరణం, మృత్తికలకు అనుగుణంగా ప్రణాళికలు అవసరమని స్పష్టం చేశారు. అందుకే దక్షిణాది రాష్ట్రాల కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌లో ప్రాంతీయ వ్యవసాయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం దక్షిణాదిలోనే ఎక్కువగా ఉందని, వర్షాభావ జిల్లాల కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రబీ సీజన్ కోసం విత్తనాలు, సేంద్రీయ వ్యవసాయం, నకిలీ పురుగుమందుల కట్టడి, నూనె గింజలు, ఆయిల్ పామ్ సాగు పెంపుపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## న్యాయస్థానాలపై నమ్మకం ఉంది

తెస్తే అందులో ఏదో జరిగిపోయిందంటూ ఆ రేస్‌ను క్యాన్సిల్ చేసి నా మీద కేసు పెట్టారు. అని అన్నారు.నిన్న కాక మొన్న మీరు చూశారు. తమిళనాడు సీఎం విజయ్ ఒక మోటార్ రేసింగ్ ఈవెంట్‌కి లండన్ దాకా పోయారని కేటీఆర్ గుర్తుచేశారు. అది మోటార్ రేసింగ్ స్పోర్ట్‌కి కానీ, దాని వల్ల వచ్చే ఇమేజ్ అని అన్నారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులేమో లండన్ దాకా పోయి అక్కడి నుంచి పెట్టుబడులు రాబట్టేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అదే ప్రయత్నం మేం చేసి, హైదరాబాద్‌కు, తెలంగాణకు మంచి పేరు, పెట్టబడులు తీసుకొచ్చేందుకు ప్రయత్నించినందుకు ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఫర్వాలేదని.. తమకు న్యాయస్థానాల మీద అపారమైన విశ్వాసం ఉందని కేటీఆర్ తెలిపారు. అందుకే ఇవాళ రెండోసారి కోర్టుకు హాజరయ్యానని తెలిపారు. భవిష్యత్తులో కూడా కోర్టు ఎప్పుడు పిలిచినా మళ్లీ వస్తానని స్పష్టం చేశారు.

## పాజెక్టులకు మరమ్మతులు

కష్టాలు ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారని తెలిపారు. ప్రస్తుత కరువు తీవ్రతకు పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనా వైఫల్యాలు ప్రధాన కారణమని విమర్శించారు. ఎల్‌నినో ప్రమాదాన్ని ముందే పసిగట్టి, రాష్ట్ర రైతాంగాన్ని పంటల మార్పిడికి ప్రోత్సహించామన్నారు. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై రైతు నేస్తం వేదికల ద్వారా ఖచ్చితమైన సమాచారం అందిస్తున్నామన్నారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటిమట్టాలను గత ఏడాదితో పోలుస్తూ సభకు వివరించారు.జలాశయాల్లో కనిపించే మొత్తం నీరు సాగుకు అందుబాటులో ఉన్నట్టు కాదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో 40 శాతం పావు సామర్థ్యం కన్నా తక్కువగా నిండాయనీ, వాస్తవాలను ముందే ప్రజల ముందు ఉంచుతున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్నామని బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తున్నదనీ, వాస్తవానికి కృష్ణా, గోదావరి జలాల్లో అధికభాగం తెలంగాణనే వాడుకుంటున్నదని వివరించారు. అలాగని ఆయా నదుల్లో రాష్ట్రానికి రావల్సిన నీటి వాటాలు వదులుకోబోమని స్పష్టంచేశారు. ప్రజల ప్రాణ భద్రతను పణంగా పెట్టి కాళేశ్వరం బ్యారేజీలను వినియోగించలేమని తేల్చిచెప్పారు. అదే సమయంలో ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారమే బ్యారేజీల పునరుద్ధరణ చేపడతామన్నారు. పాలమూరు--రంగారెడ్డి పథకం 90 శాతం పూర్తయిందన్న బీఆర్‌ఎస్ ప్రచారం అవాస్తవమనీ, కేవలం పంప్‌హౌస్‌లు నిర్మిస్తే ఎత్తిపోతల పథకం పూర్తయినట్టు కాదని స్పష్టం చేశారు. పాలమూరు--రంగారెడ్డిలో కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు అసంపూర్తిగా ఉన్నాయనీ, చట్టబద్ద అనుమతులు, మిగిలిన నిర్మాణాలు పూర్తిచేసి ఆ ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

## భారత నౌకనుఢీకొన్న పాక్ నౌక..

ఉల్లంఘించడమే. ఏప్రిల్, 1991లో కుదిరిన ఒప్పందను అనుసరించి.. పీఎన్‌ఎస్ హునైన్ నౌక ప్రమాదకరంగా వ్యవహరించిందన్నారు.అలాగే, అంతర్జాతీయ సముద్ర జలాల్లో ప్రమాదాలు జరగకుండా ఉన్న చట్టాల్ని కూడా పాకిస్తాన్ ఉల్లంఘించిందని రణధీర్ జైస్వాల్ ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు.. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంపై పాకిస్తాన్ ఆర్మీ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. భారత నౌకను ఢీకొన్న ఘటనలో పాకిస్తాన్ నౌక ఎక్కువగా ధ్వంసమైనట్లు సమాచారం. అయితే, భారత నౌకకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటన తర్వాత భారత నౌక సముద్ర జలాల్లో ఎప్పట్లాగే ప్రయాణించింది.

## అడ్డగోలు ఆరోపణలు




రాసిస్తామని, రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాల్లో రూ.లక్ష కోట్లు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.'సీఎం రేవంత్.. నువ్వు చేసిన ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క శాతం నిజం లేకపోయినా.. నీకు ఓ ఆఫర్ ఇస్తున్నా. మా కుటుంబానికి లక్ష కోట్ల భూములంటూ పనిగట్టుకుని చేస్తున్న విష ప్రచారంపై నీకు ఓ సవాల్ విసురుతున్నా. మాకున్న ఆస్తులన్నీ రాసిస్తాం.. రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాలో రూ.లక్ష కోట్లు వేస్తావా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.తెలంగాణలోని పేద ప్రజల ఖాతాల్లో వెంటనే రూ.లక్ష కోట్లు వేస్తానంటే తమ పేరుతో ఉన్న ప్రతి ఇంచు భూమిని ఉన్నపళంగా రాసిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. పేదల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు వేసేంత ధైర్యం లేకుంటే తనపై చేస్తున్న ప్రచారాన్ని ఇకనైనా ఆపి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "నీ పిచ్చి ప్రచారాన్ని ఇకనైనా మానుకుని వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు" అని అన్నారు. కేసీఆర్ కుటుంబానికి వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇంతకాలం చేసిన ప్రచారం బెడిసికొట్టడంతో ఇప్పుడు లక్ష కోట్ల భూములంటూ రేవంత్ రెడ్డి కొత్త ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది 67 ఎకరాలు మాత్రమేనని రేవంత్ రెడ్డే అసెంబ్లీలో స్వయంగా అంగీకరించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్తు చేశారు. అలాంటప్పుడు మళ్లీ కుతంత్రాలతో కట్టుకథలు అల్లుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు విషయంలో జరిగిన మోసాల నుంచి, 22ఏ భూముల అంశం నుంచి నాలుగు కోట్ల మంది ప్రజల దృష్టిని ఇలాంటి ఆరోపణలతో మళ్లించలేరని ఆయన స్పష్టం చేశారు."నువ్వు చేసిన ఆరోపణల్లో విషం తప్ప విషయం లేదు. అందులో అసత్యాల వరద, అబద్ధాల బురద తప్ప ఒక్కటంటే ఒక్క శాతం నిజం లేదని తెలిసినా ఎందుకీ కుప్పిగంతులు?" అని సీఎంను సూటిగా కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిం దంటూ ఇలాగే దుష్ప్రచారం చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క పైసా అవినీతిని కూడా నిరూపించలేకపోయారని ఆయన అన్నారు. ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి లక్ష కోట్ల భూములంటూ మరోసారి ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్ముతారని భావించడం సరికాదని ముఖ్యమంత్రికి ఆయన హితవు పలికారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడి, నాలుగు కోట్ల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్ జీవితం తెరిచిన పుస్తకమని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు, యూరియా సంక్షోభం, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షంపై సీఎం బురదజల్లడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, వెయ్యి రోజులు గడిచినా పది శాతం ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. తన పాలనా వైఫల్యాలను ఇలాంటి ప్రచారంతో కప్పిపుచ్చలేరని ఆయన పేర్కొన్నారు.పవిత్రమైన అసెంబ్లీలో అసత్యాలు, అభూత కల్పనలతో మాట్లాడి చట్టసభ గౌరవానికి రేవంత్ రెడ్డి భంగం కలిగించారని కేటీఆర్ ఆరోపించారు. ఇది క్షమించరాని విషయమని పేర్కొన ఆయన.. 22ఏ కింద కోటి 20 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుకే సీఎం చెబుతున్న లక్ష కోట్ల భూముల కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. అక్రమ దందాలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చారని రేవంత్ రెడ్డిని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. దోచుకోవడం, కుంభకోణాలు చేయడం తప్ప ఆయనకు పరిపాలన చేతకాదని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి ఏర్పడగానే కాంగ్రెస్ ప్రభుత్వంలోని అవినీతి, అక్రమాలు, కుంభకోణాలన్నింటినీ బయటపెడతామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల సాక్షిగా దోచుకున్న ప్రతి పైసాను కక్కిస్తామని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ అన్నారు.

## 22 ఏ నుంచి రేవంత్ తప్పించుకోలేడు..

చేతనైతే బీఆర్‌ఎస్ సభ్యులను శాసనసభకు అనుమతించి చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బయటకు పంపి బ్యాట్స్‌మెన్ లేకుండా కాంగ్రెస్ బౌలింగ్ చేస్తుందని విమర్శించారు. తమకు అవకాశం ఇస్తే అసెంబ్లీలో సిక్సుల మోత మోగుతుందని అన్నారు. ఎర్రవల్లి భూముల సర్వేలో ప్రభుత్వానికి దళితుల నుంచి చుక్కెదురైందని వెల్లడించారు. ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకుండా సర్వే పేరిట ఫాం హౌస్ చుట్టూ తిరుగుతు న్నారని ఆరోపించారు. డ్రామా పొడిగింపు కోసమే ఎమ్మెల్యేలు , ఎంపీలను పంపుతామం టున్నారని ఆయన అన్నారు. కాలయాపన చేయడానికే హై లెవెల్ కమిటీ ని ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో పేరిట పేరిట డ్రామాలాడి ఆంధ్రాకు నీటిని పంపుతున్నారని ఆరోపించారు. రైతులు ఇప్పటికైనా మేల్కోవాలని , నమ్మి ఓటేసినందుకు గొయ్యి తొవ్వుతున్నారని అర్థం చేసుకుని రైతులు తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# కుల గణనలో బీసీలకు అన్యాయం జరగొద్దు..

### కేంద్రానికి కల్వకుంట్ల కవిత వార్నింగ్!

హైదరాబాద్,సెప్టెంబర్-18:బీసీ కులాల జనాభాను తక్కువగా చూపి.. వారు ఐక్యంగా పోరాడకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలాన్ని కులాల వారీగా చూపకుండా బలహీన వర్గాలను కులాల సముహాలుగా విడగొట్టి ఐక్య పోరాటాలు జరగకుండా ప్రయత్నాలు చేస్తోందన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సులో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. కేంద్రం చేపట్టే కులగణనలో బీసీ జనాభా విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం క్యాస్ట్ కాలం పెట్టేసి చేతులు దులుపుకుంటామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రతి రాష్ట్రంలో ఉన్న కులాల జాబితాను కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా ఉపకులాలను కూడా కలిపి లెక్కించాలి. లేదంటే బీసీల జనాభా తక్కువగా కనిపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే కులానికి సంబంధించి దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందని...ఆ సమస్యను పరిష్కరించాలంటే బీసీ కులాల ఉపకులాలను కూడా కలిపి లెక్కించటం జరగాలన్నారు. లేదంటే ఉప కులాల్లో ఉండే వారికి న్యాయం జరగదని వారిని కూడా ఒక కులంగా లెక్కల్లో చూపే ముప్పు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ లో ఉన్న 57 ఉపకులాల కారణంగా ఉప కులాల్లో వారికి న్యాయం జరగటం




లేదన్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. అయినప్పటికీ వేల కోట్లు ఖర్చు చేస్తూ బీసీ జనగణనలో కూడా పరిష్కారం లేకుండా చేయటం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని కవిత పేర్కొన్నారు. కేంద్రం చేపట్టే కుల గణన ద్వారా ఆ సమస్య తీరుతుందని భావిస్తే...వాళ్లు సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని మండిపడ్డారు. కుల గణనకు సంబంధించి మరో నాలుగు నెలల సమయం ఉందని...ఈ లోగా కేంద్రం ఈ సమస్య పరిష్కరించటంపై దృష్టి సారించాలన్నారు. మన డీఎన్‌ఏలోనే కుల వివక్ష కుల వివక్ష అనేది మన డీఎన్‌ఏలోనే పాతుకుపోయిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, స్పీకర్ లాంటి వాళ్లు కూడా కుల వివక్షకు గురికావటం అన్యాయమన్నారు. ఈ జఠిలమైన సమస్యకు పరిష్కారం అవసరమన్నారు. ఈ సమస్యకు అప్పర్ కాస్ట్, బాధితుడు అనే రెండు కోణాలున్నాయని.. బాధితుడి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే సరైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మారోజు వీరన్న చెప్పినట్లుగా ప్రతి కులాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. రాజ్యాధికారంతో పాటు ఆర్థికంగా ఆయా కులాలను బాగు చేయాలని.. అధికారంలో ఉన్న పార్టీలే ఆ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చట్టాల పరంగా ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు వేతనం ఇవ్వాలి పురుషులతో సమానంగా పనిచేసినప్పటికీ మహిళలకు వేతనాల్లో వ్యత్యాసం చూపించటం అన్యాయమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టాలు ఉన్నప్పటికీ.. 2026లో కూడా వేతన వ్యత్యాసం చూపుతున్నారన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై ఎక్స్ లో ట్వీట్ చేశారు. మహిళల శ్రమకు సమానమైన విలువ ఇచ్చినప్పుడు మాత్రమే నిజమైన పురోగతి సాధ్యమవుతుందన్నారు.

# సామాన్యులకు కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి..

### కిలో ఏకంగా 70రూపాయలు!

హైదరాబాద్,సెప్టెంబర్-18:
ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లేదు అన్నట్టు ఉంది ప్రస్తుత పరిస్థితి. నిత్యం ఇంట్లో అవసరం అయిన ఉల్లిపాయలు కంట నీరు తెప్పిస్తున్నాయి. వంటగదిలో రోజువారీ వంటకాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉల్లిపాయల ధరలు ప్రస్తుతం ఒక్కసారిగా భగ్గుమంటున్నాయి. ఉల్లిపాయను కూరలో వెయ్యాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. సరఫరాలో ఏర్పడిన తీవ్ర అంతరాయాలు డిమాండ్‌కు తగినట్లుగా నిల్వలు అందుబాటులో లేకపోవడంతో మార్కెట్లో ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వివిధ రిటైల్ మార్కెట్లు మరియు కూరగాయల దుకాణాల్లో మంచి నాణ్యత గల ఉల్లిపాయల ధర కిలో ఏకంగా రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. గతంలో రూ.100కు ఐదు కిలోలు లభించిన పరిస్థితుల నుంచి,ఇప్పుడు కేవలం ఒక్క కిలో కొనాలన్నా రూ.70 పైగా వెచ్చించాల్సి వస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉల్లిపాయలను కొనుగోలు చేయటానికి ఇబ్బంది పడుతున్నారు. ఉల్లి సాగుచేసే ప్రాంతాల నుంచి మార్కెట్లకు సరుకు రాక తగ్గడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు, రవాణా సమస్యల కారణంగా సరఫరా గొలుసు దెబ్బతినడంతో డిమాండ్ కు తగ్గ సరుకు అందటం లేదు. ఫలితంగా హోల్‌సేల్ మార్కెట్లలోనే



ధరలు ఊపందుకున్నాయి. దీని ప్రభావం నేరుగా రిటైల్ మార్కెట్లపై పడటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉల్లి ఘాటు ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదని వ్యాపార వర్గాలు కూడా చెప్తున్నాయి. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు ఉల్లిపాయల ధరల నియంత్రణకు కృషి చెయ్యాలని కూడా ప్రజల నుండి డిమాండ్ వినిపిస్తుంది. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో పాటు, కూరగాయల ధరలు కూడా పెరిగాయి. దీంతో సామాన్యులు కూరగాయలు కొనుగోలు చేయడానికి కూడా ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ధరల నియంత్రణకు ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని బఫర్ స్టాక్‌ను మార్కెట్లోకి విడుదల చేయాలని, రాయితీ ధరలపై రైతు బజార్ల ద్వారా ఉల్లిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద భారీ కొండచిలువ

హైదరాబాద్,సెప్టెంబర్-18:
హైదరాబాద్ ఐటీ హబ్ మాదాపూర్ దుర్గం చెరువు పరిసర ప్రాంతంలో గురువారం రాత్రి ఓ ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ కార్యాలయం సమీపంలో భారీ కొండచిలువ హఠాత్తుగా ప్రత్యక్షమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, రాత్రి వేళల్లో విధులకు హాజరయ్యే ఐటీ ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరుగులు తీశారు. నిత్యం జనసంచారంతో ఎంతో రద్దీగా ఉండే దుర్గం చెరువు ఐటీ లేన్ పరిసరాలలో ఇంత పెద్ద కొండ చిలువ కనిపించడం ఆశ్చర్యానికి గురి చేసింది.దీనికి సంబంధించిన వీడియోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఐటీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన ద్వారానికి సమీపంలో ఆ పెద్ద కొండచిలువ కనిపించింది. దీన్ని గమనించిన వాహనదారులు స్నేక్ క్యాచర్ కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే స్నేక్ క్యాచర్ అక్కడికి చేరుకున్నాడు. ఎంతో చాకచర్యంగా, దానికి ఎటువంటి హాని కలగకుండా సురక్షితంగా పట్టుకున్నాడు. తన చేతికి చుట్టుకుని స్కూటర్ పై వెళ్లిపోయాడతను. 10-15 ఏళ్ల కిందటి వరకు కూడా దుర్గం చెరువు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు మినీ అడవిని తలపించేవి. పెద్ద పెద్ద రాతి గుట్టలు, సహజసిద్ధమైన పొదలతో వన్యప్రాణులకు అనుకూలమైన ప్రదేశంగా ఉండేవి. ఈ భౌగోళిక కారణాల వల్ల ఇక్కడ వన్యప్రాణుల సంచారం ఎప్పటి నుంచో సహజంగానే ఉంటోంది. ఇటీవలి కాలంలో ఐటీ కారిడార్‌లో కాంక్రీట్ కట్టడాలు రికార్డు స్థాయిలో పెరిగిపోవడంతో వాటి సహజ ఆవాసాలు క్రమంగా హరించుకుపోయాయి. భారీ వర్షాలు కురిసిన సమయంలో వాటి నివాసాల్లోకి పెద్దఎత్తున నీరు చేరినప్పుడు ఇటువంటి కొండచిలువలు లేదా సరీసృపాలు పొడి ప్రదేశాల కోసం హఠాత్తుగా రోడ్లపైకి వస్తుంటాయని చెబుతున్నారు. రాత్రి సమయాలలో షిఫ్టులకు వెళ్లే ఐటీ ఉద్యోగులు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు దుర్గం చెరువు, కేబుల్ బ్రిడ్జి చుట్టుపక్కల మార్గాల్లో వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు. కార్యాలయాల ప్రాంగణంలో లేదా ఖాళీగా ఉన్న నిర్జన స్థలాలలో పాములు కనిపిస్తే సొంతంగా వాటిని పట్టుకోవడానికి కానీ, లేదా చంపడానికి కానీ సాహసించకూడదని సూచించారు. అటువంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అటవీశాఖ హెల్ప్‌లైన్‌కు లేదా స్వచ్ఛంద వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ గ్రూపులకు సమాచారం అందించి సకాలంలో రక్షించాల్సిందిగా వన్యప్రాణి సంరక్షణ నిపుణులు సూచిస్తోన్నారు.

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా ..

ఆర్టీసీ సంస్థలో పలు కార్మిక సంఘాలు, యూనియన్లు ఉన్నాయి. అయితే ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలనే చట్టబద్ధమైన గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ ఎన్నికలను ప్రాంతీయ, రాష్ట్రస్థాయిల్లో వేర్వేరుగా నిర్వహిస్తారు. ఈ రెండు స్థాయిలకు సంబంధించి ఓటర్లకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను అందిస్తారు. కార్మికుల హక్కుల రక్షణలో గుర్తింపు సంఘానిదే ప్రధాన పాత్ర. ఆర్టీసీ కార్మికుల వేతనాల పెంపు, సీఆర్‌తో పాటు జీతాల సవరణ, బోనస్లు, కరువు భత్యం(డీఏలు), పెండింగ్ బకాయిలు, సర్వీసు నిబంధనలలో మార్పులు, డిపోల పనివేళలు వంటి అత్యంత కీలకమైన సంఘానికి నేరుగా ఆర్టీసీ యాజమాన్యంతో, ప్రభుత్వంతో అధికారిక చర్చలు జరిపే ఏకైక చట్టబద్ధమైన హక్కు ఈ యూనియన్‌కే దక్కుతుంది.కార్మికుల సంక్షేమానికి సంబంధించి యాజ మాన్యంతో చట్టబద్ధ ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్టీసీలో పనిచేసే వరంగల్ రీజియన్‌స్థాయి అధికారి హోదా మినహా మిగిలిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు, కార్మికులందరూ ఈ ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కల్పించారు. సుధీర్ఘకాలం తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆర్టీసీ డిపోల్లో ఇప్పటికే ఎన్నికల వేడి మొదలైంది. కార్మిక సంఘాలు కూడా తమ ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నాయి.ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ రావడంతో కార్మిక సంఘాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే డిపోల వారీగా ప్రచారం కూడా ముమ్మరం చేశాయి. గెలిచిన సంఘాన్ని ప్రభు త్వంలో విలీనానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంతో గెలుపు కోసం కార్మిక సంఘాలు కష్టపడుతున్నాయి. డిసెంబర్ 9న విలీన ప్రక్రియపై తుది ప్రకటన చేసే అంశంపై ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యానికి సంకేతాలు అందినట్లు సమాచారం. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఏప్రిల్ నెలలో సమ్మె చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం సహా యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఎన్నికలు సహా విలీనంపై ఫోకస్ పెట్టారు.వరంగల్ రీజియన్‌లో క్రియాశీలకంగా ఉన్న ప్రధాన ఆర్టీసీ యూనియన్లు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ), తెలం గాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ), ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్డబ్ల్యూఎఫ్), బజన మోటార్ కార్మిక సంఘం(బీఎంకేఎస్) అండ్ ఇతర చిన్న సంఘాలు ఉన్నాయి. వరంగల్ ఆర్టీసీ జేఏసీ(జాయింట్ యాక్షన్ కమిటీ) వరంగల్ పరిధిలోని ఈ ప్రధాన యూనియన్లన్నీ కలిసి ఆర్టీసీ జేఏసీగా ఏర్పడ్డాయి. వరంగల్ రీజియన్‌కు యాక స్వామి జేఏసీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్‌లో నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య అనంతరం ఈ జేఏసీ ఆధ్వర్యంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున సమ్మె, బంద్, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయడం. ఉద్యోగులను పూర్తిస్థాయి ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించడం. 2017, 2021 వేతన సవరణ(పీఆర్సీ) బకాయిలను వెంటనే విడుదల చేయడం. మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మీ పథకం) ప్రవేశపెట్టిన తర్వాత పెరిగిన పని భారానికి సమానంగా సిబ్బందిని నియమించడం, పని ఒత్తిడిని తగ్గించడం.

# తెలంగాణ

## సమ్మె విరమించండి.. సమస్యలు పరిష్కరిస్తాం

### రైస్‌మిల్లర్లతో మంత్రివర్గ ఉపసంఘం చర్చలు

హైదరాబాద్,సెప్టెంబర్-18:
తమ సమస్యలపరిష్కారం కోసం రైస్ మిల్లుల బంద్‌కు పిలుపునిచ్చిన రైస్ మిల్లర్ల అసోసియేషన్లతో మంత్రివర్గ ఉపసంఘం చర్చలు జరిపింది. రైస్ మిల్లర్ల సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగేసింది. శుక్రవారం అసెంబ్లీ కమ్యూనిటీ హాల్‌లో మంత్రివర్గ ఉపసంఘంతో చర్చలు జరిపారు. చర్చల్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు డైరెక్టర్ రోహిత్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున తూడి దేవేందర్ రెడ్డి, గంప నాగేందర్, మోహన్ రెడ్డి, గణపతి రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లను ప్రత్యర్థులుగా కాకుండా ధాన్యం కొనుగోలు వ్యవస్థలో భాగస్వాములుగా చూస్తామని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధన పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మిల్లర్ల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలించి సాధ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పారు. మిల్లర్లపై అనవసర భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. రైతులకు చెల్లించిన మద్దతు ధరను, ప్రభుత్వ వడ్డీ భారాన్ని విస్మరించలేమని స్పష్టం చేశారు.బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ వాస్తవ వ్యయం కంటే తక్కువకు టెండర్ ధాన్యం ధర నిర్ణయించడం సాధ్యంకాదని వెల్లడించారు. ప్రజాధనాన్ని తిరిగి రాబట్టుకోవడమే లక్ష్యం తప్ప మిల్లర్లపై అదనపు భారం వేయడం కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విధించిన పెనాల్టీలంటూ మిల్లర్ల సమస్యలను పక్కన పెట్టబోమని భరోసా ఇచ్చారు. పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలపై సమగ్ర పరిశీలన చేయిస్తామని తెలిపారు. ఏడాది, రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సరఫరాలతో పౌర సరఫరాల సంస్థపై వడ్డీ భారం పెరిగిందని చెప్పారు. మిల్లర్ల ఆర్థిక ఇబ్బందులను గౌరవిస్తూనే రైతుల ప్రయోజనాలను కాపాడుతామని వివరించారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించి ప్రస్తుత సమ్మెను విరమించాలని మిల్లర్లకు విజ్ఞప్తి చేశారు. మిల్లర్ల డిమాండ్ల పరిశీలనకు నాలుగైదు రోజుల గడువు ఇవ్వాలని మంత్రి కోరారు. నాలుగైదు రోజుల్లో మిల్లర్ల ప్రతినిధులతో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా పరస్పర ఆమోద యోగ్యమైన పరిష్కారం చేస్తామన్నారు. ఘర్షణకు బదులు చర్చలతో సమస్యకు ముగింపు పలకాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. రైతు సంక్షేమం, ప్రజాధనం, మిల్లింగ్ రంగం ప్రయోజనాల మధ్య సమతుల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పునరుద్ఘాటించారు.

## దానంపై హైకోర్టు వేటు..

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. దానం నాగేందర్‌పై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి 2024 మార్చి 18న, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 2024 జూలై 1న స్పీకర్ వద్ద పిటిషన్ దాఖలు చేశారు. వీటిని స్పీకర్ కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ ఇద్దరూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనల విన్న ధర్మాసనం ఆగస్టు 21న తీర్పును రిజర్వు చేసింది. శుక్రవారం 91 పేజీల కీలక తీర్పును వెలువరించింది.

## ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా ..

(మొదటిపేజీ తరువాయి)

వేడి మొదలైం ది.ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు పూర్తిచేసి విజేతలను ప్రకటించనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. దాంతో.. వరంగల్ రీజియన్ పరిధి లోని ఆర్టీసీ డిపోల్లో(హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, నర్సంపేట, పరకాల, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, తొరూరు) యూనియన్ల సందడి, ప్రచారం ముమ్మరమైంది. చివరిసారిగా ఆర్టీసీలో 2018లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి.ఇప్పుడు 2026 గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ముందుగా గుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు జరిపి.. అనంతరం ప్రభుత్వంలో విలీనం చేపడతామని ప్రభుత్వం తెలిపింది. ఆర్టీసీ ప్రభుత్వ విలీన ప్రక్రియ నేపథ్యంలో ఈ గుర్తింపు సంఘం ఎన్నికలు అత్యంత కీలకంగా మారడంతో సంఘాల మధ్య తీవ్ర పోటీ నెలకొననుంది.

balagamtv100@gmail.com

# • జాతీయం-అంతర్జాతీయ

## 22 ఏ భూములపై రేవంత్ కీలక నిర్ణయం..

(మొదటిపేజీ తరువాయి)
తమ భూములను అమ్ముకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక యజమానులు సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పష్టతనిచ్చారు. బాధితుల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన హై-లెవల్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ రాబోయే 30 రోజుల్లోగా అర్హులైన భూ యజమానుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనుంది. అవసరమైతే చట్ట సవరణలు చేసి, జిల్లాల వారీగా అడ్డంకులను తొలగించి ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం ప్రణాళిక చేయనుంది.

## మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

### ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్

### పోటీ నుంచి వైదొలగిన పార్టీ నందిగ్రామ్ అభ్యర్థి

### ఇది చీకటి దినమని ఆరోపించిన మాజీ సీఎం



కోల్‌కతా, సెప్టెంబర్ 18 : వచ్చే నెల ఆరో తేదీన నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలకు ముందు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి షాక్ తగిలింది. మూడు దశాబ్దాలుగా ఉన్న ఆమె పార్టీ పేరు, గుర్తు గల్లంతయ్యింది. ఆమెకు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ రెండుగా చీలిపోయిన క్రమంలో పార్టీ పేరు, గుర్తులను ఎన్నికల సంఘం స్తంభింప జేసింది. ఈ క్రమంలో రాబోయే ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం మమతా బెనర్జీ, పార్టీ చీలిక వర్గానికి తాత్కాలికంగా కొత్తపేర్లు, ఎన్నికల గుర్తులను శుక్రవారం కేటాయించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, పార్టీ గుర్తుగా 'ఫుట్‌బాల్ ఆటగాడి'ని కేటాయించింది. అదే సమయంలో చీలిక వర్గానికి డెమోక్రాటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరును, పార్టీ గుర్తుగా కవరును కేటాయించింది. ఈ గుర్తులు కేవలం ఉప ఎన్నికల వరకేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మేలో ముగిసిన తర్వాత రితబ్రతా బెనర్జీ నేతృత్వంలో పార్టీని చీల్చి వేరే వర్గంగా ఏర్పడిన సంగతి తెలిసిందే. తమదే అసలైన టీఎంసీ అని అతను ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడంతో ఇప్పుడు దానిపై వివాదం నడుస్తున్నది. పోటీ నుంచి తప్పుకున్న మమత పార్టీ అభ్యర్థిఉప ఎన్నికలకు ముందు మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. అక్టోబర్ 6న జరిగే నందిగ్రామ్ ఉప ఎన్నికకు మమతా బెనర్జీ తరపున పోటీ చేయనున్న సంచితా ప్రధాన్ దే పోటీ నుంచి విరమించుకున్నారు. ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన కొద్ది గంటలకే ఆమె ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా, సువేందు అధికారి భవానీపూర్, నందిగ్రామ్‌ల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, ఆయన నందిగ్రామ్ ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక జరుగుతున్నది. తన పార్టీ పేరు, గుర్తును స్తంభింపచేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మమతా బెనర్జీ భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి దినమని అభివర్ణించారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో తాను పూర్తిగా విభేదిస్తున్నానని, ఈసీ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, అన్యాయ ం, అప్రజాస్వామికమని, పూర్తిగా వివక్షాపూరితంగా ఉందని ఆరోపించా రు. ఒక రాజకీయ పార్టీ ఇగోను సంతృప్తి పర్చడానికే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. 29 ఏండ్లుగా ఉన్న పార్టీ గుర్తును, పేరును స్తంభింప చేయడం పట్ల ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీని ఆమె జుమ్లా పార్టీ అని విమర్శించారు. తాను ఇండియా కూటమిలో ఉన్నానని, తమ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తుందని ఆమె ప్రకటించారు. తాము బీజేపీని తరిమికొట్టాలనుకుంటున్నామని, ఆ పార్టీతో పోరాటానికి సిద్ధం గా ఉన్నామని ఆమె తెలిపారు. అయితే నందిగ్రామ్‌లో తమ పార్టీ అభ్యర్థిని పోటీ కి దించమని, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తామని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన మమతా బెనర్జీ వాస్తవానికి ఈ సీటు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని భావించారు. అనూహ్యంగా ఆమె ఈ సీటుకు సంచితా ప్రధాన్ దేను అభ్యర్థిగా ప్రకటించారు. నామినేషన్ల దాఖలుకు బుధవారమే ఆఖరు తేదీ కావడంతో మమతకు మరో అభ్యర్థిని నిలిపే అవకాశం లేకుండా పోయింది.

### మమత మద్దతిచ్చిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ అభ్యర్థి అరెస్ట్

కోల్‌కతా: నందిగ్రామ్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిలాన్ ప్రధాన్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తామని మాజీ సీఎం మమతా బెనర్జీ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అతడిని చాలా ఏండ్ల నాటి ఒక పాత హత్య కేసులో అరెస్ట్ చేశారు. 2007లో జరిగిన నందిగ్రామ్ భూసేకరణ వ్యతిరేక నిరసనల్లో జరిగిన హత్య కేసులో అతడిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తూ ప్రకటన చేయడం మమత ఇష్టమని, మద్దతు ఇవ్వాలని తామైతే ఆమెను కోరలేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు.

## ఎన్‌టీఏ ఆఫీసుకు వెళ్లనున్న సుప్రీంకోర్టు జడ్జిలు

### నీట్ ఏర్పాట్లపై నేరుగా తనిఖీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్-18: సుప్రీం కోర్టు న్యాయమూర్తులు త్వరలో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కార్యాలయాన్ని సందర్శించే అవకాశం ఉంది. నీట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టే ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఎంతవరకు అమలువుతున్నాయో పరిశీలించేందుకు ఈ తనిఖీ చేపట్టాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలను అడ్డుకునేందుకు తీసుకొచ్చిన చర్యలు వాస్తవంగా పనిచేస్తున్నాయా లేదా అనే దానిని పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం తెలిపింది. ఆగస్టు 19న కేంద్రం సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరాల్లో నీట్ వ్యవస్థను సమూలంగా మార్చామని, దానిని ఉల్లంఘించడం కష్టమని పేర్కొన్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

## నవజాత శిశువులకు బంగారు ఉంగరం

### 28న కొత్త పథకం ప్రారంభించనున్న విజయ్



చెన్నై : తమిళనాడులోని ప్రభుత్వ దవాఖానల్లో పుట్టిన నవజాత శిశువులకు బంగారు ఉంగరం అందించే కొత్త పథకాన్ని సీఎం విజయ్ ఈ నెల 28 నుంచి ప్రారంభించనున్నారు. తైమామస్ తంగ మోతిరమ్ తిట్టం (మేనమామ బంగారు ఉంగరం పథకం) కింద ఒక గ్రాము బంగారు ఉంగరాలను అందించనున్నారు. 2026 జూన్ 22 తర్వాత పుట్టిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. తొలిదశ పంపిణీలో భాగంగా 1.28 లక్షల ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విజయ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ పథకం పొందాలంటే తల్లిదండ్రులు తమిళనాడుకు చెందిన శాశ్వత నివాసితులై ఉండాలి. ఈ పథకం కోసం విజయ్ ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 755.83 కోట్లు కేటాయించనుంది.

# కేంద్రం ఆదుకోవాలి



పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి తగిన సాయం మంజూరు చేయాలి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధిలో కేంద్ర వాటాను సత్వరమే విడుదల చేయాలి. పంట నష్టం/ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, పశు సంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జలవనరుల పునరుద్ధరణతో పాటు ఉపశమన చర్యలకు తగిన సహాయం అందించాలి. అవసరమైతే అందుకు వీలుగా నిబంధనలను సడలించాలి. 'వీబీ గ్రామ్ జీ'లో 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలి. ఈ చట్టంపై ఖర్చు పెట్టే వ్యయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో అమల్లో ఉన్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలి. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు లేబర్ బడ్జెట్‌ను తగినంతగా పెంచాలి. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను తగినంతగా, సకాలంలో కేటాయించాలి. ప్రభావిత జిల్లాలకు ముందుగానే రేక్‌ల ద్వారా సరఫరా చేయాలి. పర్ డ్రాప్ మోర్ క్రాప్కింద కేటాయింపులను పెంచి డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంగా విస్తరించాలి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవెలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ కింద కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు ఆర్థిక సహాయం అందించాలి. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి. తెలంగాణకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్తు కేటాయించాలి. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కేటాయించకుండా ఉన్న కోటా నుంచి దీన్ని అందించాలి. విండో--× కింద 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ నిర్ధారించి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రేక్‌ల లభ్యతను పెంచాలి. విద్యుత్తు ట్రాన్స్ మిషన్ చార్జీలను సడలించి, అవసరమైన సాయం అందించాలి. తాగు, సాగు నీటి అవసరాలు, కరువు నివారణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలి. చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవ, పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వివిధ కేంద్ర పథకాల కింద తగిన సహాయం అందించాలి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. తద్వారా ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు అవకాశం కల్పించాలి. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సాయం అందించాలి. అందుకు అవసరమైన తీరుగా నిబంధనలను సడలించాలి.." అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానించింది. అంతకుముందు స్వల్ప కాలిక చర్చకు మల్లు భట్టి విక్రమార్క సమాధానమిస్తూ, ఎల్ నినో వల్ల రాష్ట్రంలో నెలకొనబోయే పరిస్థితుల నేపథ్యంలో ఏప్రిల్ మాసం లోనే రైతులు, ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన పెంచే కార్య క్రమాలను చేపట్టినట్టు తెలిపారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో వర్షపాతం లోటు 20 శాతంగా ఉందనీ, దీంతో 19 జిల్లాలు వర్షాభావ కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. 88 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయనీ, వరిసాగు విస్తీర్ణం 18 శాతానికి తగ్గిందని, పలుమార్లు విత్తనాలు వేయాల్సి రావటంతో రైతులు, కౌలు రైతులపై పెట్టుబడి భారం పెరిగిందని చెప్పారు. జలాశయాల సామర్థ్యం 585 టీఎంసీలు కాగా సెప్టెంబర్ 15 నాటికి 241 టీఎంసీల నిల్వ మాత్రమే ఉందని తెలిపారు. నీటిని తాగునీటి అవసరాలకు రిజర్వ్ చేసుకోవాల్సి ఉందనీ, ఈ నీటి నిల్వలు యాసంగి పంటలకు సాగునీటిని అందించేందుకు సరిపోవని స్పష్టం చేశారు. సాగునీరు, తాగునీటి సరఫరాకు భూగర్భ జలాలు, విద్యుత్తుపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోందని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితిని ముందే అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగుకు అవసరమైన విద్యుత్తు సరఫరాకు అవసరమైన ఉపశమన చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయసహకారాలనుఅందించాల్సిన అవసరముందని చెప్పారు.

## ట్రంప్ వార్నింగ్.. అస్సలు తగ్గేదే లేదన్న భారత్!



న్యూఢిల్లీ, సెప్టెంబర్-18: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధించే చట్టంపై సంతకం చేయడానికి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అదే జరిగితే.. రష్యా, ఇరాన్ దేశాల నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలు 100 శాతం వరకు సుంకాలను ఎదుర్కోవలసి రావచ్చు. భారత ప్రభుత్వం ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. తన వైఖరిని దాదాపుగా స్పష్టం చేసింది. రష్యాపై ఆంక్షలు విధించే అమెరికా బిల్లు ఆమోదం పొందడంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. తమ 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను నిర్ధారించేందుకు భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని, ఇంధనం కొనుగోలు చేయడం కొనసాగిస్తుందని పేర్కొంది. ఈ విషయంపై భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ చర్య అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పైనే కాకుండా భారత్, అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొంది. యూఎస్ కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఈ విషయంలో తదుపరి పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇటీవలి సంవత్సరాలలో రష్యా నుంచి భారతదేశం చేసే ముడి చమురు కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయి. అమెరికా ప్రతినిధుల సభ 'లిండ్సే ఓ. గ్రాహం ఆంక్షల చట్టం'ఆమోదించిన తరుణంలో భారత్ ఈ ప్రకటన చేసింది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు శిక్షాత్మక సుంకాలను విధించేందుకు ఈ బిల్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారం కల్పిస్తుంది. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసే దేశాలలో భారత్, చైనా కూడా ఉన్నాయి. ఈ చర్య వల్ల ఆ దేశాలు ప్రభావితం కావచ్చు. ఉన్నత స్థాయిలో అమెరికాతో తమ ఆందోళనలను భారత్ ఇప్పటికే ప్రస్తావించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా స్పష్టం చేసింది. అమెరికా చర్య వల్ల కలిగే పరిణామాలను భారత్ ఎత్తి చూపడం ఇది మొదటిసారి కాదని స్పష్టమవుతోంది. ఈసారి ఈ సమస్య చమురు కొనుగోళ్లపై విభేదాలకు మించిపోయినట్లు కనిపిస్తోంది.

## సుప్రీం చెప్పినా డోంట్ కేర్..!

### నవోదయ స్కూళ్లపై తేల్చేసిన విజయ్ సర్కార్..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్-18: తమిళులు తమ భాష, సంస్కృతి, విధానాల విషయంలో ఎంత పట్టుదలగా ఉంటారో విజయ్ సర్కార్ మరోసారి నిరూపిస్తోంది. రాష్ట్రంలో హిందీ అమలు చేసేందుకు వీలుగా నవోదయ స్కూళ్లను నెలకొల్పేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు విజయ్ సర్కార్ భూములివ్వకుండా అడ్డంకులు సృష్టిస్తోంది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. మైండ్ సెట్ మార్చుకోవాలంటూ ప్రభుత్వానికి చురకలు అంటించింది. మూడు నెలల్లో నవోదయ స్కూళ్లకు ప్రభుత్వం భూమి ఇచ్చితీరాలంటూ తేల్చిచెప్పింది. దీనిపై స్పందించిన తమిళనాడు ప్రభుత్వం ద్విభాషా విధానం విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పేసింది. నవోదయ స్కూళ్లకు భూమి కేటాయించేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి రాజ్ మోహన్ స్పష్టమైన ప్రకటన చేశారు. ద్విభాషా సూత్రం అమలు విషయంలో తాము ప్రస్తుత విధానానికే కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎలాంటి మార్పు లేదన్నారు. నవోదయ స్కూళ్లకు భూమి కేటాయింపు విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తన అభిప్రాయం వెల్లడించారని, ఇదేమీ తుది తీర్పు కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ నడుస్తోందని మంత్రి రాజ్ మోహన్ గుర్తుచేశారు. తాము హిందీకి గానీ, ఏ ఇతర భాషకు గానీ వ్యతిరేకం కాదని, తాము ఇప్పటికే మోడల్ స్కూళ్లను విజయవంతంగా నడిపిస్తున్నామని, వీటి ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తున్నారని విద్యాశాఖ మంత్రి గుర్తుచేశారు. అంతకు ముందు నిన్న సుప్రీంకోర్టు.. తమ రాష్ట్రంలో హిందీ బోధన జరగకూడదనే ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలంటూ విజయ్ సర్కార్ కు సూచించింది. రాష్ట్రాలు విడిగా దేశాల తరహాలో విధానాలు అమలుచేయలేవని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## వరంగల్ కేంద్రంగా సైబర్ ముఠా..





### • దేశవ్యాప్తంగా 185 సైబర్ నేరాలతో లింకులు!

హైదరాబాద్, సెప్టెంబర్-18: వరంగల్‌లో అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టు రట్టు చేశారు వరంగల్ కమిషనరేట్ పోలీసులు. సైబర్ మోసాల కేసులో 22 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వీరికి దేశవ్యాప్తంగా 185 సైబర్ నేరాలతో లింకులు ఉన్నట్టు గుర్తించారు. వరంగల్ కేంద్రంగా గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఈ దందాను, ఈ సైబర్ నేరగాళ్ళ ముఠాను అరెస్ట్ చేసే పనిలో ఉన్నారు. ముద్ర రుణాల పేరుతో అమాయకుల బ్యాంకు ఖాతాలను సేకరించి వాటి ద్వారా వీరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వరంగల్ కేంద్రంగా ముఠా నుంచి 216 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 8 చెక్‌బుక్‌లు, 22 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. పలు సిమ్ కార్డులు, స్మార్ట్ ఫోన్లు, రెండు కార్లు, హార్డ్ డిస్కులు, క్యూఆర్ స్కానర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా బాధితులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని నమ్మించి, వారి పేర్ల మీద బ్యాంకు ఖాతాలు తెరిపించి, ఆ తర్వాత రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు కమిషన్ ఇస్తామని చెప్పి నమ్మించి పాస్‌బుక్‌లు, ఏటీఎమ్ కార్డులు, చెక్‌బుక్‌లను తీసుకునే వారు. సైబర్ నేరాల ద్వారా వచ్చిన అక్రమ డబ్బును ఈ మ్యూల్ ఖాతాల ద్వారా మళ్లించేవారు. వరంగల్ కేంద్రంగా మొదలైన ఈ నెట్‌వర్క్ ఢిల్లీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వరకు విస్తరించింది. దర్యాప్తులో ఈ ముఠాకు దేశవ్యాప్తంగా నమోదైన 185 సైబర్ నేర కేసులతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తేలింది. ప్రధాన సూత్రధారుల కోసం గాలించిన పోలీసులు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు కీలక నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు కీలక నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి తమ బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత వివరాలు ఇతరులకు అమ్మవద్దని వరంగల్ పోలీస్ కమీషనరేట్ కమీషనర్ శ్వేత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి దందాల్లో పాల్గొంటే చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయని పోలీసులు హెచ్చరించారు.

## ఎల్‌నినో ప్రభావంతో 17 జిల్లాల్లో లోటు వర్షపాతం : మంత్రి పొంగులేటి




హైదరాబాద్, సెప్టెంబర్-18: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 17 జిల్లాల్లో లోటువర్షపాతం ఏర్పడే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కొన్ని మండలాల్లో ఒకేసారి క్లౌడ్ బరెస్ట్ జరిగినట్టు ఒక నెలలో పడాల్సిన వర్షం ఒక గంటలో కురిస్తే రికార్డులలో వర్షపాతం నమోదైనా వాస్తవానికి ఆ నీరు ప్రజలకు ఉపయోగపడదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారని గుర్తు చేశారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేయాలి, ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో మండలాలు, ప్రధాన గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించామని అన్నారు. క్యాబినెట్ నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నష్టనివారణ చర్యలు చేపట్టారని చెప్పారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లపై ఆధారపడుతున్నారనీ, 33 లక్షల పంప్‌సెట్లు పనిచేస్తున్నాయని అన్నారు. పశుసంపదపైనా ప్రత్యేక దృష్టిసారించామని వివరించారు. కేంద్రం నుంచి అన్ని రంగాల్లో సహకారం అవసరమని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఇదేనని అన్నారు.

## తుమ్మిడిహెట్టిపై కేంద్రాన్ని ఒప్పించండి :

### రాష్ట్ర బీజేపీ నాయకులకు విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్-18: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవగాహనలేని రీ ఇంజినీరింగ్‌తో కాళేశ్వరం గుండెకాయను కూల్చేసిందనీ, ఫలితంగా రాష్ట్రంలో సాగునీటి రంగం భ్రష్టుపట్టిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాకుండా తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్రాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం వరకు, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ వరకు, పాలమూరు--రంగారెడ్డి నుంచి రాజీవ్ భీమా, జవహర్ నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వరకు రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి పథకాల స్థితిగతులను శాసనసభ ముందుంచారు.

## శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..నలుగురు మృతి




హైదరాబాద్, సెప్టెంబర్-18:
శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పిన కారు కల్వర్టును ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం చౌడూరు గ్రామవాసులుగా గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

# నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలకు అనుమతి ఇవ్వాలి..




**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ (డీఐపీసీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించారు.

ముందుగా టీజీ ఐ పాస్, టీ ప్రైడ్ కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అనుమతి కోసం ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఏ ఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. టీజీ ఐ పాస్ కింద 44, టీ ప్రైడ్ కింద 83 దరఖాస్తులకు అనుమతులు జారీ అయ్యాయని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అనుమతులు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ బీఎం అనిల్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, కమర్షియల్ ట్యాక్స్ అధికారి కిరణ్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఎన్ పీడీసీఎల్, టీజీఐఐసీ, పీసీబీ అధికారులు శ్రీనివాస్, విక్రమ్, కనకజ్యోతి, డీటీసీ పీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.



## భీమేశ్వరాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు..

బలగం టీవీ, వేములవాడ :

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విప్ ఆలయానికి విచ్చేయగానే ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఆది శ్రీనివాస్ కి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి, పూలమొక్కను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆలయ ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థాన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఎల్లారెడ్డిపేట, కిషన్ దాస్ పేట(కిష్టంపల్లి)లో పల్లె దవాఖానాలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట



పల్లె దవాఖానాలతో ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, కిషన్ దాస్ పేట(కిష్టంపల్లి)లో పల్లె దవాఖానాల ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా పల్లె దవాఖానాలు ప్రారంభించారు. పల్లె దవాఖానాలో నిర్మించిన వివిధ గదులను అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాల నిర్మాణంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ప్రతి రోజూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు వృద్ధులకు వైద్య సేవలు అందిస్తారని వివరించారు. పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు, ఆరోగ్య పరీక్షలు, సలహాలు సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, సర్పంచ్ నరసింహులు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, ఇంచార్జి తహసీల్దార్ రజని, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

**-ప్రజాసేవలో మరింతగా రాణించాలని ఆకాంక్ష**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ఆది శ్రీనివాస్ కీ సి ఎం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో మరింతగా భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పల్లె దవాఖానకు ఎలక్ట్రిక్ ఆటో ఏర్పాటు చేయాలి.



**జిలా కలెకర్‌కు మాజీ ఎంపీటీసీ వినతి.**

బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలం కిష్టంపల్లిలో నిర్మించిన పల్లె దవాఖానకు వచ్చే గర్భిణులు, బాలింతలు, ఇతర రోగుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ ఆటోను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్‌ను కోరారు.

కిష్టంపల్లిలోని పల్లె దవాఖానకు గర్భిణులు, బాలింతలు సుమారు కిలోమీటరున్నర దూరం నుంచి నడిచి లేదా ఇతర వాహనాలపై రావాల్సి వస్తోందని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు కలగకుండా దవాఖానకు రవాణా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్.. గ్రామపంచాయతీకి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేసి, పల్లె దవాఖానకు రోగులను తీసుకురావడానికి వినియోగించుకోవచ్చని సూచించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎల్లారెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఎనుగందుల నరసింహులుకు కలెక్టర్ సూచించినట్లు మాజీ ఎంపీటీసీ తెలిపారు. పల్లె దవాఖానకు వచ్చే రోగులకు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని బాలరాజు యాదవ్ కోరారు.



## గుంతలు పూడ్చి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చిన అనంతారం సర్పంచ్

బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట, అనంతారం గ్రామాల మధ్య నిత్యం రద్దీగా ఉండే రహదారి బ్రిడ్జి వద్ద ఇరువైపులా గుంతలు ఏర్పడి ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్థానిక వాహనచోదకులు సమస్య ను అనంతారం గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన సర్పంచ్ డోజర్, జేసీబీ ల సహాయం తో బ్రిడ్జి కి ఇరువైపులా కొంత మట్టి పోసి గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వాహన దారుల ఇబ్బందులు చేసి తాత్కాలిక పరిష్కారం చేయడం జరిగిందని అధికారుల చొరవ తో పూర్తి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఫిషరీష్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, గోనెపల్లి వెంకటేష్, దారవేణి పర్శరాము, గండికోట తిరుపతి, దోమకొండ కిరణ్, బొల్లం పరశురామ్ తదితరులు ఉన్నారు

# మండల వైద్యాధికారిపై డీఎంహెచ్‌వోకు జర్నలిస్టుల ఫిర్యాదు

**ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణ**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు ముందుగా అందించడం లేదని ఆరోపిస్తూ మండలానికి చెందిన జర్నలిస్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి (డీఎంహెచ్‌వో) ఫిర్యాదు చేశారు.

మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం స్థానిక మీడియాకు అందడం లేదని జర్నలిస్టులు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే వైద్య ఆరోగ్య కార్యక్రమాల వివరాలు ప్రజలకు చేరేందుకు మీడియాకు సమయానుకూలంగా సమాచారం అందించడం అవసరమని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడంలో స్థానిక మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, అందువల్ల మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల సమాచారాన్ని జర్నలిస్టులకు అందించాలని డీఎంహెచ్‌వోను కోరారు.

జర్నలిస్టుల ఫిర్యాదుపై స్పందించిన మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఇకపై మండలంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు,



ఆరోగ్య అవగాహన కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందిస్తే ప్రజలకు మరింత సమాచారం చేరే అవకాశం ఉంటుందని జర్నలిస్టులు బండారి బాల్ రెడ్డి , ఒగ్గు బాలరాజు యాదవ్, కులేరి కిషోర్ కుమార్, పెంటమ్ శ్రీనివాస్, సురేష్ యాదవ్, ఒగ్గు మహేష్ చంద్ర, ముద్రకోలా కృష్ణ పేర్కొన్నారు.



## పోషణ మాసంతో తల్లులు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి పాల్గొని పోషణ మాసం కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, తల్లులు పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, పాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పిల్లల ఆహారంలో భాగం చేయాలని అంగన్వాడీ సిబ్బంది తల్లులకు వివరించారు. పిల్లల బరువు, ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన పోషకాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓతో పాటు అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గ్రామానికి చెందిన తల్లులు తదితరులు పాల్గొన్నారు. పోషణ మాసం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని పిల్లల ఆరోగ్యం, పోషణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

# ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 60వ జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిద రాజేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. నిరాడంబరంగా జీవిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్కే సాబేరా బేగం, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, సర్పంచులు కల్లూరు బాపిరెడ్డి, మామిళ్ల కిషన్, నెత్తట లక్ష్మయ్య, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, మేడిపల్లి దేవానందం, షేక్ సాహెబ్, గిరిధర్‌రెడ్డి, గంట బుచ్చగౌడ్, మూర్తి వెంకటేష్, రవి, రఫీక్, గుర్రం రాములు, మాదాసు బాబు, దండు శ్రీనివాస్, కంచర్ల రాజు, ఏర్పుల శ్రీనివాస్, ఎల్లా గౌడ్, సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక వేధింపులు.. నిందితుడికి 20 ఏళ్ల జైలు

**-పోక్సో కోర్టు తీర్పు.. రూ.1,000 జరిమానా**

**-ఎస్పీ మహేష్ బి. గితే**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికపై మధ్యప్రదేశ్‌కు చెందిన చతుర్‌సింగ్ మున్నా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా, దీంతో అప్పటి ఎల్లారెడ్డిపేట సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించగా,అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు.కేసు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల 19 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాగా .,పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారని తెలిపారు .

మహిళలు, బాలికల భద్రతకు పోలీస్‌శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వేధింపులు, అన్యాయం ఎదురైతే మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లో కృషి చేసిన అప్పటి, ప్రస్తుత డీఎస్పీలు చంద్రశేఖర్, నాగేంద్రచారి, అప్పటి, ప్రస్తుత సీఐలు బన్సీలాల్, వెంకటేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రవణ్ యాదవ్, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమేష్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికను ఎస్పీ అభినందించారు.



## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణమూర్తి శర్మకు భద్రాచలం దేవస్థానంలో ఆత్మీయ సత్కారం

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుగ్గ కృష్ణమూర్తి శర్మను తిమ్మాపూర్ సింగిల్ విండో డైరెక్టర్లు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆత్మీయంగా సత్కరించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా కృష్ణమూర్తి శర్మ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, డైరెక్టర్లు పెంజర్ల నారాయణ, రాయవేణి లక్ష్మణ్, శ్రీరామ్ నాయక్, నరహరి నాయక్, గుర్రాల సత్తిరెడ్డి, అందే బాలయ్య, సీఈఓ శశివర్ధన్ గౌడ్, సిబ్బంది రాగం శ్రీకాంత్, అందే సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వెదురు బొంగుల దినోత్సవ కార్యక్రమానికి తరలివెళ్లిన ఇల్లంతకుంట మండల మేదరి మహేంద్రులు

బలగం, టీవీ ఇల్లంతకుంట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న వెదురు బొంగుల దినోత్సవం కార్యక్రమానికి ఇల్లంతకుంట మండలానికి చెందిన మేదరి మహేంద్రులు తరలివెళ్లారు.ఈ కార్యక్రమానికి బీసీ & రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై తున్నట్లు వారు తెలిపారు.వెదురు వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి మంత్రి చొరవ తీసుకుంటారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో బొల్లం కనకయ్య,శనిగరపు మల్లేశం, బొల్లం రాంసాగర్,శనిగరపు రాజమల్లయ్య, బొల్లం ధనుంజయ్, శనిగరపు మల్లేష్,శనిగరపు బక్కయ్య తదితరులున్నారు.

## రెండు కిడ్నీలు దెబ్బతిన్న నిరుపేద మహిళకు ఆర్థిక సాయం..

బలగం టీవీ, సిరిసిల్ల:



తారకరామా నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నాగుల కావ్య ఇటీవల రెండు కిడ్నీలు దెబ్బతినడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది.

కావ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దార లావణ్య అశోక్ మానవతా దృక్పథంతో స్పందించి, తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా దార లావణ్య అశోక్ మాట్లాడుతూ.. నాగుల కావ్య కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందించాలని కోరారు.

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాగుల కావ్య కుటుంబానికి వైద్య చికిత్స కోసం దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు తమ వంతు సహకారం అందించి అండగా నిలవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## ఇంటి ఆవరణలోనే మట్టి వినాయకుడి నిమజ్జనం..

**- పర్యావరణ పరిరక్షణకు నీలోజిపల్లి గ్రామస్థుడి వినూత్న సందేశం..**

బలగం టీవీ, నీలోజిపల్లి:



వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన గూడ రమేష్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఆయన వినాయక నవరాత్రుల్లో ఐదో రోజు శుక్రవారం తన ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

ఈ సందర్భంగా గూడ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. రసాయన రంగుల వినియోగం కూడా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే నిమజ్జనం చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని తగ్గించి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో రగడ

**-మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ అభ్యంతరం..**

**కాంగ్రెస్ నేతలతో వాగ్వాదం..**

**-అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం**

బలగం టీవీ,గంభీరావుపేట:



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రాజకీయ వాగ్వాదంతో రసాభాసగా మారింది. కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేషన్ బియ్యానికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న నేపథ్యంలో ఫ్లెక్సీలో మోదీ ఫొటో ఎందుకు పెట్టలేదని, కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు స్పందించడంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగింది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కూడా బీజేపీ నేతలను ప్రశ్నిస్తూ, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ప్రధాని మోదీ సన్నబియ్యం ఎందుకు అందించడం లేదని ప్రతి సవాలు విసిరారు. దీంతో ఇరుపార్టీల నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ జోక్యం చేసుకుని ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దడంతో చివరకు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగింది.అనంతరం బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# కోర్టు ఆవరణలో ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**-కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు**

బలగం టీవీ,వేములవాడ:

వేములవాడ కోర్టు ఆవరణలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆది శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రతి అడుగు ప్రజల సంక్షేమం వైపు సాగాలని, సేవాభావంతో పనిచేసే నాయకత్వానికి ప్రజల ఆశీస్సులే గొప్ప బలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్, సీనియర్, జూనియర్ కోర్టు ఏజీపీలు బొడ్డు ప్రశాంత్‌కుమార్, పుప్పాల భానుకృష్ణ, మాజీ అధ్యక్షులు వేముల సుధాకర్‌రెడ్డి, పెంట రాజు, సీనియర్ న్యాయవాదులు కొడిమ్యాల పురుషోత్తం, నాగుల సంపత్, జెట్టి శేఖర్, అన్నపూర్ణ, సరిత, వేణుకుమార్, బీమా మహేష్, మహేందర్, పద్మ, సుజాత, మమత, మహేష్, రమేష్, లావణ్య, పావని, నాగేంద్రబాబు, రాజు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై కొండూరి రవీందర్ రావు లీగల్ నోటీసు..

**అసెంబ్లీలో చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్..**

బలగం టీవీ, హైదరాబాద్:



తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తరఫున ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు జారీ చేశారు. సెప్టెంబర్ 16న అసెంబ్లీలో తన పేరును ప్రస్తావిస్తూ సిరిసిల్లలో గత ప్రభుత్వ హయాంలో పెద్ద మొత్తంలో భూమిని తీసుకున్నారంటూ చేసిన వ్యాఖ్యలు అవాస్తవం, నిరాధారం, వాస్తవ ఆధారాలు లేనివని నోటీసులో పేర్కొన్నారు.

దశాబ్దాలుగా సహకార రంగంలో పనిచేస్తూ వివిధ సహకార సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తన వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రతిష్టకు అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలతో నష్టం కలిగిందని కొండూరి రవీందర్‌రావు తరఫున నోటీసులో పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి కరీంనగర్ డీసీసీబీ, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (TSCAB), నాఫ్స్‌కాబ్ వరకు పలు బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని నోటీసులో ప్రస్తావించారు.

ముఖ్యమంత్రి వంటి అత్యున్నత ప్రజాపదవిలో ఉన్న వ్యక్తి ఒక వ్యక్తి పేరును ప్రస్తావిస్తూ ఆరోపణలు చేసే ముందు సంబంధిత వాస్తవాలను పూర్తిగా ధృవీకరించాల్సిన బాధ్యత ఉందని నోటీసులో పేర్కొన్నారు.

అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు టెలివిజన్, ప్రింట్, డిజిటల్, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కావడంతో తన వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ప్రతిష్టకు తీవ్ర నష్టం వాటిల్లిందని కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు.

7 రోజుల్లో బహిరంగ క్షమాపణకు డిమాండ్..

లీగల్ నోటీసు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కొండూరి రవీందర్‌రావు తరఫున పలు డిమాండ్లు చేశారు. సెప్టెంబర్ 16న అసెంబ్లీలో చేసిన ఆరోపణలను బేషరతుగా ఉపసంహరించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.

అలాగే, ఎటువంటి వాస్తవ ఆధారాలు లేకుండా భవిష్యత్తులో కొండూరి రవీందర్‌రావుపై అవినీతి, అక్రమాలు లేదా ఇతర తప్పిదాలకు సంబంధించిన ఆరోపణలు చేయకుండా ఉండాలని నోటీసులో డిమాండ్ చేశారు.

నోటీసులో పేర్కొన్న డిమాండ్లను 7 రోజుల్లోగా నెరవేర్చకపోతే, తన క్లయింట్‌కు అందుబాటులో ఉన్న ఇతర చట్టపరమైన మార్గాలను ఆశ్రయించి తదుపరి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం.

# ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి..

**- అసెంబ్లీ ఎన్నికల్లో దొరలను మట్టికరిపించిన చరిత్ర ఆయనది: పర్శ హన్మాండ్లు**

బలగం టీవీ, హైదరాబాద్:



తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు తెలిపారు.

ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనను పర్శ హన్మాండ్లు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ.. ఆది శ్రీనివాస్ మొక్కవోని ధైర్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ అంచెలంచెలుగా ఎదిగారని అన్నారు. ఎంపీపీగా, జెడ్పీటీసీగా, వేములవాడ ఆలయ చైర్మన్‌గా వివిధ బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ విప్ స్థాయికి ఎదిగారని తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా బలమైన ప్రత్యర్థిని ఓడించి వేములవాడ నియోజకవర్గంలో విజయం సాధించిన ఘనత ఆది శ్రీనివాస్‌కు దక్కుతుందని పర్శ హన్మాండ్లు అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, మరోవైపు బీసీల సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి కల్పిస్తే బీసీలు, వెనుకబడిన వర్గాల సమస్యలకు మరింత ప్రాధాన్యత లభించే అవకాశం ఉంటుందని పర్శ హన్మాండ్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఆది శ్రీనివాస్ ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పర్శ హన్మాండ్లు తెలిపారు.

# సొమ్మొక్కడిది సోకొక్కడిది..



- నాయకులు, అధికారులు కలెక్టర్ తీరును ఖండిస్తున్న బిజెపి మండల శాఖ

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిష్టంపల్లి, బస్టాండ్ ప్రాంతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరై ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆయుష్మాన్ భారత్ పల్లె దవాఖాన ప్రారంభోత్సవానికి బీజేపీ నాయకులను ఆహ్వానించకపోవడంపై ఆ పార్టీ నేతలు అధికారులను ప్రశ్నించారు. బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ కిరణ్ నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు గంట బాలకృష్ణ, కొత్త చెన్నయ్య అధికారులను వివరణ కోరగా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు.

వివిధ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ అధికారికంగా దవాఖానను ప్రారంభించారని బీజేపీ నేతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నప్పటికీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం సరికాదన్నారు.

అన్ని పార్టీలను సమదృష్టితో చూడాల్సిన అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని బీజేపీ మండల శాఖ నాయకులు ఆరోపించారు. ఇటువంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని, భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# జపాన్‌పై భారత్ విక్టరీ





### సెమీస్‌లోకి ఎంట్రీ!
### 8 వికెట్ల తేడాతో ఘనవిజయం; 4 వికెట్లతో చెలరేగిన తెలుగు తేజం శ్రీచరణి

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా గేమ్స్ 2026 టోర్నీలో భారత మహిళల క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్ మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి 19.5 ఓవర్లలో కేవలం 57 పరుగులకే కుప్పకూలింది. తెలుగు తేజం శ్రీచరణి 10 పరుగులిచ్చి 4 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్నుముక విరిచగా, షెఫాలీ వర్మ 2 వికెట్లు పడగొట్టింది. శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ తలో వికెట్ తీసి జపాన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు.

అనంతరం 58 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కేవలం 5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసి విజయాన్ని అందుకంది. ఓపెనర్ షెఫాలీ వర్మ 15 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 40 పరుగులు చేసి ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించగా, రిచా ఘోష్ 12 పరుగులతో వేగంగా ఇన్నింగ్స్ ముగించింది.

ఆదివారం జరగనున్న రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. వర్షం కారణంగా చైనాతో మ్యాచ్ రద్దుకావడంతో మెరుగైన ర్యాంకింగ్ ఉన్న బంగ్లాదేశ్ నేరుగా సెమీస్ చేరింది. ఇక మరో సెమీఫైనల్లో శ్రీలంకతో పాకిస్థాన్ తలపడనుండగా, సెమీస్‌లో భారత్, పాకిస్థాన్ జట్లు గెలిస్తే ఫైనల్లో దాయాదుల పోరును చూసే అవకాశం ఉంది.

# అందుకే వైభవ్‌ను ఆడించలేదు..

### టీమ్ కాంబినేషన్‌పై గంభీర్ స్పష్టత!
### సంజూ శాంసన్ కోసం వైభవ్ సూర్యవంశీ వేచి చూడక తప్పదు; ప్రపంచకప్ విన్నింగ్ కాంబినేషన్‌కే మా ప్రాధాన్యత

బలగం టీవీ, హైదరాబాద్

అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ క్లారిటీ ఇచ్చారు. ప్రపంచకప్ గెలిచిన కాంబినేషన్‌ను కొనసాగించాలనే ఉద్దేశంతోనే సంజూ శాంసన్‌ను ఆడించామని, అందువల్లే వైభవ్ అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

అఫ్గాన్‌పై 3-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గంభీర్ మాట్లాడుతూ — సంజూ శాంసన్ సత్తా ఏంటో అందరికీ తెలుసని, ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన ఆటగాడిని పక్కన పెట్టడం తన కోచింగ్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌లో సంజూను ఆడించలేకపోయినా, ప్రస్తుతం ఆటగాళ్ల ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రపంచకప్ విజేత జట్టు కూర్పుకే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు.

కేవలం కొన్ని మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన ఆటగాళ్లు చెత్తగా మారిపోరని గంభీర్ వ్యాఖ్యానించారు. జట్టు కోసం కొన్నేళ్లుగా అద్భుతంగా ఆడుతున్న వారికి తగిన సమయం ఇవ్వడం ము ముఖ్యమని, వైభవ్ సూర్యవంశీ విషయంలో యాజమాన్యానికి స్పష్టత ఉందన్నారు. జట్టులో 15 ఏళ్ల కుర్రాడైనా లేదా 30



ఏళ్ల ఆటగాడైనా అవకాశం కోసం నిరీక్షించాల్సిందేనని, డ్రెస్సింగ్ రూమ్‌లో ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# తొలి యూత్ వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘనవిజయం!



### 7 పరుగుల తేడాతో గెలుపు; ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్ అరంగేట్రం

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌లో భారత అండర్-19 టీమ్ శుభారంభం చేసింది. రాజ్‌కోట్ వేదికగా శుక్రవారం హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. వర్షం కారణంగా అంపైర్లు ఈ మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించారు.

ఈ మ్యాచ్ ద్వారా భారత మాజీ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ ద్రవిడ్ అండర్-19 క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్యవీర్ సెహ్వాగ్ 26 బంతుల్లో 5 ఫోర్లతో 28 పరుగులు చేయగా, యశ్‌బర్ధాన్ చౌహాన్ (54) అర్ధశతకంతో రాణించాడు. అన్వయ్ ద్రవిడ్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 38 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు.

అనంతరం 183 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా అండర్-19 జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది. ఆసీస్ బ్యాటర్లలో కెప్టెన్ జాక్ జోస్నెక్ (55) పోరాడినప్పటికీ, భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. భారత బౌలర్లలో యశ్‌బర్ధాన్ చౌహాన్ 2 వికెట్లు తీయగా.. మోహిత్, చిగురుపాటి వెంకట తలో వికెట్ పడగొట్టారు.

తన కుమారుడు ఆర్యవీర్ అరంగేట్ర క్యాప్ అందుకోవడాన్ని వీరేంద్ర సెహ్వాగ్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ద్రవిడ్, సెహ్వాగ్‌ల వారసులు ఇద్దరూ క్రికెట్‌లో రాణిస్తుండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఒలింపియాడ్‌లో భారత జట్ల విజయాల హ్యాట్రిక్!

### చెస్ ఒలింపియాడ్: వరుసగా మూడో విజయం!
### ఓపెన్ విభాగంలో ఇటలీపై, మహిళల సెక్షన్‌లో గ్రీస్‌పై ఘనవిజయం; అదరగొడుతున్న గుకేశ్, హంపి

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్లు అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నాయి. ఓపెన్, మహిళల విభాగాల్లో ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత్.. శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లోనూ అదే జోరును కొనసాగించి విజయాల హ్యాట్రిక్ సాధించింది.

ఓపెన్ విభాగంలో 3-1 తేడాతో ఇటలీని భారత్ చిత్తు చేసింది. భారత గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరిన్, డి.గుకేశ్‌లు తమ ప్రత్యర్థులపై అద్భుత విజయాలు సాధించగా, ఆర్.ప్రజ్ఞానంద, అర్జున్ ఎరిగైసిలు తమ గేమ్‌లను డ్రాలతో ముగించారు.

మరోవైపు మహిళల విభాగంలోనూ భారత్ 3.5-0.5 పాయింట్ల తేడాతో గ్రీస్‌ను ఏకపక్షంగా ఓడించింది. స్టార్ ప్లేయర్లు కోనేరు హంపి, వంతిక అగర్వాల్, సవిత శ్రీలు తమ ప్రత్యర్థులపై ఘనవిజయాలు సాధించగా, దివ్య దేశ్‌ముఖ్ ఆడిన గేమ్ డ్రాగా ముగిసింది.

# ఆసియాడ్ ప్లేయర్లకు వసతి తిప్పలు..

### ప్రవాస భారతీయుల సాయం కోరిన కేంద్రం!
### నాగోయాలో నానా అవస్థలు పడుతున్న క్రీడాకారులు; 2,000 భారతీయ కుటుంబాలకు ఎంబసీ అభ్యర్థన

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా గేమ్స్ 2026 ప్రారంభానికి ముందే జపాన్‌లోని నాగోయా నగరంలో అథ్లెట్లకు తీవ్రమైన వసతి సమస్య ఎదురవుతోంది. నిర్వాహకులు ప్రత్యేకంగా 'అథ్లెట్స్ విలేజ్' నిర్మించకుండా ఖర్చులు తగ్గించుకునేందుకు కంటైనర్ తరహా ఇళ్లు, క్రూయిజ్ షిప్‌లు మరియు కొన్ని హోటళ్లలో వసతి కల్పించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో భారత క్రీడాకారులకు గదులు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది.

పరిస్థితి చేయిదాటిపోకుండా నాగోయాలోని ప్రవాస భారతీయుల (NRIలు) సాయం కోరాలని కేంద్రం నిర్ణయించింది. నాగోయాలోని భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) అక్కడ నివసిస్తున్న దాదాపు 2,000 భారతీయ కుటుంబాలతో మాట్లాడి, అత్యవసర పరిస్థితి వస్తే క్రీడాకారులకు వసతి కల్పించడానికి సిద్ధంగా ఉండాలని కోరింది. ప్రవాస భారతీయులు కూడా దీనికి సానుకూలంగా స్పందించి ఎయిర్‌పోర్టులోనే అథ్లెట్లకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సాయపడుతున్నారు.

ఇప్పటికే నిర్వాహకులు గదులు కేటాయించడంలో విఫలం కావడంతో బ్యాడ్మింటన్ జట్టుతో సహా దాదాపు 35 మంది భారతీయ క్రీడాకారులను అత్యవసరంగా హోటళ్లకు తరలించారు. భారత చీఫ్-డి-మిషన్ సహదేవ్ యాదవ్ స్పందిస్తూ, అదనపు గదులు బుక్ చేయడం మరియు ఎన్‌ఆర్‌ఐల సాయం తీసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాగా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా వంటి ఇతర దేశాల అథ్లెట్లు కూడా ఈ వసతి లోపాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.






# రికార్డులతో మెరిసిన తెలంగాణ అథ్లెట్లు.. స్వర్ణాల పంట!

### ఉదయ్ కిరణ్, సాయి ఆదిత్య, స్వప్నలకు పసిడి పతకాలు
### 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో మీట్ రికార్డు బద్ధలు

బలగం టీవీ, హైదరాబాద్

పుదుచ్చేరి వేదికగా జరుగుతున్న నేషనల్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఉదయ్ కిరణ్, కె. స్వప్న, సాయి ఆదిత్యలు అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు.

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం పర్వతాపూర్‌కు చెందిన ఉదయ్‌కిరణ్ లాంగ్‌జంప్ ఈవెంట్‌లో 6.86 మీటర్ల దూరం దూకి బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్ సాయ్-ఎస్‌టీసీలో శిక్షణ పొందుతున్న సాయి ఆదిత్య 600 మీటర్ల పరుగును 1 నిమిషం 24 సెకన్లలో పూర్తి చేయడంతో పాటు మిడ్లే రిలేలోనూ స్వర్ణాలు నెగ్గి ద్విపాత్రాభినయం చేశాడు. ఇక కె. స్వప్న 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌ను 11 నిమిషాల 25.39 సెకండ్లలో ముగించి కొత్త మీట్ రికార్డును నెలకొల్పుతూ పసిడి పతకాన్ని ముద్దాడింది.

ఇదే టోర్నీలో ఆనంది మిడ్లే రిలేలో కాంస్యం నెగ్గి తన ఖాతాలో మూడో పతకాన్ని వేసుకోగా, సుశాంత్ రెడ్డి (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), మనోజ్ (5000 మీటర్లు) కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిని చాటారు.



# గ్రామీణ క్రికెటర్ల శ్రేయస్సుకే ప్రత్యేక సంఘం..

### బీసీసీఐ పెద్దలకు వెంకటేశ్వర్ రెడ్డి వినతి!
### హెచ్‌సీఏ జంట నగరాలకే పరిమితమైందన్న స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్
### ముంబై ఏజీఎమ్‌లో వినతిపత్రం సమర్పణ

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ క్రికెట్ సంఘానికి (టీసీఏ) బీసీసీఐ సభ్యత్వం కల్పించాలని స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి బోర్డు యాజమాన్యాన్ని కోరారు. జంట నగరాలకు మాత్రమే పరిమితమైన హెచ్‌సీఏ వల్ల గత తొమ్మిది దశాబ్దాలుగా రాష్ట్రంలోని వేలాది మంది గ్రామీణ క్రికెటర్లు అవకాశాలు, కనీస మౌలిక వసతులు లేక నిరాదరణకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక క్రికెట్ సంఘం ఏర్పాటు ద్వారానే గ్రామీణ తెలంగాణ ప్రతిభావంతులకు సరైన ప్రాతినిధ్యం మరియు న్యాయం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

ఈ మేరకు శుక్రవారం ముంబైలో జరిగిన బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (AGM) సందర్భంగా బోర్డు అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలను వెంకటేశ్వర్ రెడ్డి కలిసి టీసీఏ గుర్తింపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. పుదుచ్చేరి, అండమాన్ వంటి ప్రాంతాలకు అసోసియేట్ సభ్యత్వం కల్పించిన మాదిరిగానే టీసీఏకు కూడా గుర్తింపు ఇస్తే, దాదాపు 2.5 కోట్ల జనాభా కలిగిన గ్రామీణ తెలంగాణ యువతకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# డేవిస్ కప్‌లో భారత్‌కు తొలిరోజే షాక్


### కొరియాతో క్వాలిఫయర్స్‌లో రెండు సింగిల్స్‌లోనూ ఓటమి.. 0-2తో వెనుకంజ

బలగం టీవీ, హైదరాబాద్

డేవిస్ కప్ ఫైనల్-8 బెర్తు లక్ష్యంగా బరిలోకి దిగిన భారత టెన్నిస్ జట్టుకు తొలిరోజే నిరాశ ఎదురైంది. కొరియాతో క్వాలిఫయర్స్‌లో శుక్రవారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లు ఓటమిపాలయ్యారు. దీంతో భారత్ 0-2తో వెనుకబడింది.

తొలి సింగిల్స్‌లో దక్షిణేశ్వర్ సురేశ్ 6-3, 3-6, 4-6తో కొరియా నంబర్ వన్ సన్‌వో క్వాన్ చేతిలో ఓడిపోయాడు. రెండో సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 6-2, 4-6, 5-7తో హెయాన్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

శనివారం జరిగే డబుల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ల్లో భారత్ గెలిస్తేనే నాకౌట్ దశకు చేరుకునే అవకాశం ఉంటుంది.:::






# అజిత్ అగార్కర్‌పై త్వరలోనే నిర్ణయం


### బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా
### 'క్రికెట్‌లో 15 రోజులు చాలా పెద్దది'; దుబాయ్‌లోని ఆసియా కప్ ట్రోఫీలపైనా స్పష్టత

బలగం టీవీ, హైదరాబాద్

భారత పురుషుల సీనియర్ క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం, ఆయన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. శుక్రవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన బీసీసీఐ 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (AGM) అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.


అగార్కర్ కాంట్రాక్టు ముగియడానికి ఇంకా సమయం ఉందని, సరైన సమయంలో దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని సైకియా తెలిపారు. "ప్రస్తుతానికి ఎవరి వ్యక్తిగత పదవిపైనా చర్చ జరగలేదు. ఇంకా 15 రోజుల సమయం ఉంది, క్రికెట్ ప్రపంచంలో 15 రోజులు అనేది చాలా పెద్దది. తగిన సమయంలో నిర్ణయం తీసుకుని మీకు తెలియజేస్తాం" అని పేర్కొన్నారు.

ఇక దుబాయ్‌లోని ఏసీసీ (ACC) కార్యాలయంలో ఉండిపోయిన భారత పురుషుల, మహిళల ఆసియా కప్ ట్రోఫీల గురించి కూడా ఆయన మాట్లాడారు. నిర్దిష్టమైన సమయం చెప్పలేనప్పటికీ, త్వరలోనే ఆ రెండు ఆసియా కప్ ట్రోఫీలు ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా సుభాదీప్ ఘోష్‌ను తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, ఆయన పనితీరును పరిశీలించిన తర్వాత తదుపరి నిర్ణయం ఉంటాయని వెల్లడించారు.



# 'రణబాలి' రిలీజ్ డేట్ ఫిక్స్

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఈ సినిమాను నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఏందయ్యా సామీ..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విజయ్, రశ్మిక పెళ్లి సందర్భంగా రిలీజ్ చేసిన 'ఏందయ్యా సామీ..' సాంగ్ ప్రోమో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇప్పుడీ ఫుల్ వెర్షన్ సాంగ్ కోసం ఆడియెన్స్ వేచి చూస్తున్నారు. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న వివాహం తర్వాత కలిసి నటిస్తున్న సినిమాగా అటు వారి ఫ్యాన్స్ లోనూ, ఇటు మూవీ లవర్స్ లోనూ ఈ సినిమా ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది అని చిత్ర యూనిట్ తెలిపింది.



# CINEMA

## అనుకున్న సమయానికి కష్టమేనా?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ వార్ డ్రామా 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలను గమనిస్తే ఈ ఏడాది 'ఫౌజీ' విడుదల అసాధ్యమనే టాక్ వినిపిస్తున్నది. బ్యాలెన్స్‌గా ఉన్న వర్క్ కారణంగా ఈ సినిమా డిసెంబర్ బరి నుంచి తప్పుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన రెండు భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించాల్సి ఉంది. వీటికి 40రోజుల కాల్‌షీట్లు అవసరమని చెబుతున్నారు. దీనితో పాటు కొంత ప్యాచ్ వర్క్ కూడా మిగిలి ఉండటంతో మొత్తంగా 50రోజులకుపైగా షూటింగ్ అవసరం ఉంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న 'ఫౌజీ' రిలీజ్ కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న ఈ సినిమా ప్రేక్షకులముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అయితే ఇవి కేవలం ఊహాగానాలేనని, ముందస్తు ప్రకటించిన తేదీనే సినిమా విడుదలవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

# నా రూటే సపరేటు..

'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో పాన్-ఇండియా విజయం సాధించిన హీరో తేజ సజ్జ ప్రస్తుతం 'జాంబీ రెడ్డి 2 నెక్స్ట్ లెవెల్'గా వస్తున్న 'జోంబీ రెడ్డి' సెకెండ్ పార్ట్ లో నటిస్తున్నారు. 'జాంబీ రెడ్డి' క్రియేటర్ ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు క్రియేటర్ గా, సుపర్ణ్ ఎస్ వర్మ దర్శకుడిగా చేస్తున్నారు. 'హక్', 'రానా నాయుడు', 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వంటి ప్రశంసలు అందుకున్న ప్రాజెక్ట్స్‌తో పాటు పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లకు రచయితగా పనిచేసిన సుపర్ణ్ ఎస్. వర్మ.. ఈ ఫ్రాంచైజ్‌కు తనదైన ఇంటెన్స్ టచ్‌ను తీసుకొస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తేజ సజ్జా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. గతంలో వీరి కాంబి నేషన్‌లో 'మిరాయ్' బ్లాక్ బస్టర్ అయ్యింది. తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'జాంబీ రెడ్డి 2' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోకు సెన్సేష నల్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండగా.. షనాయా కపూర్ ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కానున్నారు. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఉపేంద్రను ఇంతకుముందెన్నడూ చూడని వైల్డ్, ఫియర్స్, లార్జర్ దెన్ లైఫ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. భారీ చెట్టు కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ.. ఒక చేతిలో పొడవైన ఆయుధాన్ని పట్టుకుని కనిపించారు. రఫ్ లుక్, విరబోసుకున్న జుట్టు, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్ తో ఈ క్యారెక్టర్ ఎవరు? అనే ఆసక్తిని పెంచుతున్నారు. డార్క్ కాస్ట్యూమ్, ట్రైబల్ ఇన్‌స్పైర్డ్ ప్యాటర్న్స్ ఈ క్యారెక్టర్ రా అండ్ యూనిక్ లుక్‌ను మరింత ఎలివేట్ చేస్తున్నాయి. దట్టమైన అడవి, వెలుగుతున్న కాగడాలు, మిస్టీరియస్ సిల్హౌట్స్‌తో పోస్టర్‌కు ఒక డిఫరెంట్ ఫాంటసీ-యాక్షన్ వాతావరణాన్ని క్రియేట్ చేశారు. ఇక పోస్టర్‌పై ఉన్న 'రెడీ టు టర్న్ ది వరల్డ్ అప్‌సైడ్ డౌన్' అనే ట్యాగ్‌లైన్.. ఉపేంద్ర పోజ్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, నేపాలీ, జపనీస్ భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## ది ఇంటర్న్ రీమేక్ కోసం..



అమెరికన్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్' హిందీ రీమేక్ కోసం గత ఐదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమితాబ్‌బచ్చన్, దీపికా పడుకోన్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు ప్రకటన కూడా వెలువడింది. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సినిమా ఆగిపోయింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను మరలా సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. అమిత్‌శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. 'పీకూ' తర్వాత అమితాబ్‌బచ్చన్-దీపికా పడుకోన్ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుందని సమాచారం. హాలీవుడ్ చిత్రాన్ని యథాతథంగా కాకుండా భారతీయ నేపథ్యానికి తగినట్లుగా మార్పులు చేయబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. స్వీయ నిర్మాణంలో దీపికా పడుకోన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నదని తెలిసింది. ఓ యువ వ్యాపారవేత్త ఫ్యాషన్ సంస్థను నడిపించే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, అదే సంస్థలోకి 70 ఏళ్ల రిటైర్డ్ వ్యక్తి సీనియర్ ఇంటర్న్‌గా చేరడంతో వారిద్దరి మధ్య వృత్తిపరమైన స్నేహం, మానవ సంబంధాలు ప్రధానంగా 'ది ఇంటర్న్' చిత్రాన్ని తెరకెక్కించారు.

## విభిన్న కథతో ప్రేమనే ఊరిలో



శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. మనోజ్‌కుమార్ దర్శకుడు. చందు శ్రీనివాస్, సురేశ్ కొండేటి, మమత దేవేంద్ర.ఎం కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నటి కామాక్షి భాస్కర్ల చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. చూపించిన ప్రతివారికీ ఈ సినిమా నచ్చిందని నిర్మాతల్లో ఒకరైన చందు శ్రీనివాస్ చెప్పారు. గతంలో తాను విడుదల చేసిన ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్‌మాల్ చిత్రాల స్థాయిలో 'ప్రేమనే ఊరిలో' ఉంటుందని, రూపాయి పెడితే అయిదు రూపాయిల లాభం తెచ్చిపెట్టే సినిమా అవుతుందని మరో నిర్మాత సురేశ్ కొండేటి నమ్మకంగా చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరో శ్రీరామ్, నటి తపస్విని, రమిక ఆనందం వెలిబుచ్చారు. ఇంకా సీనియర్ పాత్రికేయులు ప్రభు, రాంబాబు, గాయకుడు సాకేత్, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్, కో డైరెక్టర్ శ్రుతి, మహాదేవ్ కూడా మాట్లాడారు.

## ఆస్కార్ ఎంట్రీకి మరాఠీ థ్రిల్లర్ గోంధల్



మరాఠీ థ్రిల్లర్ 'గోంధల్' 2027 ఆస్కార్ పురస్కారాల కోసం భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఖరారైంది. శుక్రవారం ఈ విషయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. సంతోష్ దవాఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 99వ ఆస్కార్ అవార్డ్స్ బరిలో 'ఉత్తమ విదేశీ చిత్రం' కేటగిరీలో పోటీ పడనుంది. వివిధ భారతీయ భాషల నుంచి మొత్తం 33 చిత్రాల్ని పరిశీలించిన జ్యూరీ చివరకు 'గోంధల్'ను ఆస్కార్ బరిలో నిలపాలని నిర్ణయించింది. తెలుగు నుంచి 'సింగ్ గీతం' 'పెద్ది' 'ఇరుముడి' 'ఇగ్వా' (ఇంకా విడుదల కాలేదు) కమిటీ స్క్రీనింగ్‌కు వెళ్లాయి. హిందీ నుంచి '120 బహదూర్' 'బోర్డర్-2' 'ధురంధర్' 'ధురంధర్: ది రివేంజ్' 'ఇక్కీస్' 'హనుమాన్ అంశ్' చిత్రాలు పరిశీలనకు వచ్చాయి. 'గోంధల్' కథ గురించి..మహారాష్ట్ర సంప్రదాయ జానపద కళారూపమైన 'గోంధల్' నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఓ వివాహిత మహిళ జీవితంలో చోటుచేసుకునే అనూహ్య పరిణామాల చుట్టూ కథ నడుస్తుంది. కుటుంబ అనుబంధాల నేపథ్యంలో మొదలయ్యే ఈ కథ అనుకోకుండా థ్రిల్లర్‌గా మలుపు తీసుకుంటుంది. ప్రేమ, కోరిక, మోసం అంశాలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఓవైపు కుటుంబ కథతో పాటు శతాబ్దాల చరిత్ర ఉన్న 'గోంధల్' జానపద కళారూపాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. ఈ సంప్రదాయ కళకు ఆధునిక సమాజంలో ఉన్న స్థానం గురించి చర్చించారు. కిశోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేశ్ సోహోని తదితరులు చిత్ర తారాగణం. ఈ చిత్రం బెంగళూరు, పుణే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో కూడా ప్రదర్శింపబడింది. ఇళయరాజా సంగీతాన్నందించిన ఈ చిత్రం గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చింది.